RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 328 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 డిసెంబర్ 2024 గురువారం పేజీలు : 4

## అక్రమ నిర్మాణాలపై ఉపేక్ష వద్దు

### సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలు

న్యూఢిల్లీ : అక్రమ నిర్మాణాల విషయంలో సుప్రీం కోర్టు కీలక తీర్పును వెలువరించింది. పరిపాలనాపరమైన జాప్యం జరిగిందనో, పెట్టుబడులు పెట్టారనో కారణాలు చూపించి ఎట్టిపరిస్థితుల్లోనూ అక్రమ కట్టడాలను క్రమబద్ధం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ నిర్మాణాలకు బాధ్యులైన అధికారులపై జరిమానాలు విధించాలని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నివాస భవనాల ను వాణిజ్య నిర్మాణాలుగా మార్పిడి చేసిన కేసుపై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్ధీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం అక్రమ కట్టడాల నిరోధంపై వెలువరించిన 36 పేజీల తీర్పులో పలు ఆదేశాలు ఇచ్చింది. ఆ భవనాల కూల్చివేతను సమర్థించింది.

# స్వపక్షంలో విపక్షం!

## బీజేపీ హైకమాండ్ గరంగరం!!




దిల్లీ: ఎంపీలు ఎంత చెప్పినా మారడం లేదా? వారి కారణంగా మోదీ సర్కార్‌కు టెన్షన్ పట్టుకుందా? కీలకమైన బిల్లు నేపథ్యంలో విప్ జారీ చేసినా, ఎంపీలు ఎందుకు దుమ్మా కొట్టారు? స్వపక్షంలోనే విపక్షం తయారైందా? ఎంపీలపై బీజేపీ హైకమాండ్ ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేసింది? మోదీ-అమిత్ షా ద్వయం ఆలోచన ఏంటి? బీజేపీలో మోదీ హవా క్రమంగా తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. ఛరిష్మా కలిగిన నేతలను వెతికే పనిలో పడినట్లు తెలుస్తోంది. రాబోయే ఎన్నికల్లో పాతవారిని పక్కనపెట్టి కొత్తవారికి ఛాన్స్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోందట. ఇందుకు కారణాలు అనేకమని చెబుతున్నాయి పార్టీ వర్గాలు. రీసెంట్‌గా వన్ నేషన్- వన్ ఎలక్షన్ బిల్లు నేపథ్యమే దీనికి కారణమని తెలుస్తోంది. శీతాకాల పార్లమెంట్ సమావేశాలు వాడివేడీగా జరుగుతున్నాయి. కీలక బిల్లుల విషయంలో పార్టీ ఎంపీలు కచ్చితంగా సభకు రావాల్సిందేనని విప్ జారీ చేసింది బీజేపీ. అయినా ఎంపీల వైఖరి మారలేదు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు మంగళవారం లోక్‌సభకు వచ్చింది. బిల్లు పెట్టడానికి ముందు సభలో చిన్నపాటి చర్చ జరిగింది. ఆ తర్వాత బిల్లు సంబంధించి ఓటింగ్ ప్రవేశపెట్టారు న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్. వన్ నేషన్-వన్ ఎలక్షన్ కు బిల్లుకు సంబంధించి సభలో మూడింట రెండొంతుల మెజార్టీ రావాల్సివుంది. లేకుంటే బిల్లు వీగిపోయినట్లేనని ప్రతిపక్షం కాంగ్రెస్ మొదటి నుంచి చెబుతున్నమాట. బిల్లుకు మద్దతుగా 269 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 198 ఓట్లు వచ్చాయి. ఈ లెక్కన ఆ బిల్లును వీగిపోయినట్టే. కానీ బిల్లు పాసైందని లోక్‌సభ ఓకే చేయడం, ఆపై జేపీసీ పంపడం జరిగిపోయింది. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ బిల్లు విషయంలో మోదీ సర్కార్‌కు తగిలిన తొలి దెబ్బ. ఎందుకంటే ఈ బిల్లు పాస్ కావాలంటే కనీసం 360 మంది ఎంపీల మద్దతు తప్పనిసరి. రేపటి రోజు జేపీసీలో సంప్రదింపుల తర్వాత బిల్లు పెట్టినా వీగిపోవడం ఖాయమనే చర్చ ఢిల్లీ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. పరిస్థితి గమనించిన మోదీ సర్కార్, లోక్‌సభకు పార్టీకి చెందిన

## గడువు దాటితే వచ్చే సెషనే!

ఎంతమంది ఎంపీలు హాజరయ్యారు అనేదానిపై లెక్క తీశారు. ఓటింగ్ సమయంలో దాదాపు 20 మంది బీజేపీ ఎంపీలు లేరని తేలింది. వారిలో పలువురు కేంద్రమంత్రులు ఉన్నారు.

గిరిరాజ్‌సింగ్, నితిన్ గడ్కరీ, జ్యోతిరాదిత్య సింధియా, సిఆర్ పాటిల్, శంతను ఠాకూర్, జగదాంబికా పాల్, బీవై రాఘవేంద్ర, విజయ్ బాఘేల్, ఉదయ్‌రాజే భోంసాలే, జగన్నాథ్ సర్కార్, జయంత్‌కుమార్ రాయ్, సోమన్న, చింతామణి మహారాజ్ సభలో లేరని తేలింది. దీనిపై బీజేపీ హైకమాండ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఆయా నేతలతో గతరాత్రి గట్టిగా మాట్లాడినట్టు సమాచారం. ఇదిలావుండగా వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లుకు సంబంధించి 48 గంటల్లోపు జేపీసీ ఏర్పాటు చేయకపోతే ఆ బిల్లు వీగిపోవడం ఖాయమనే చర్చ సాగుతోంది.

బిల్లు ఇప్పుడు వీగిపోతే వచ్చే సెషన్‌లో ప్రవేశ పెట్టాలంటున్నాయి పార్లమెంట్ వర్గాలు. మరో రెండురోజుల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగియనున్నారు. ఈ నేపథ్యంలో మోదీ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.




## టీజీపీఎస్సీ ద్వారా నియామకాలు

### వేములవాడ, ధర్మపురి, కొండగట్టుకు లింకు రోడ్లు

### అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : ఆర్టీసీలో కొత్తగా 3,039 ఉద్యోగాలను టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అసెంబ్లీలో సభ్యులు వివేక్, ఆదిశ్రీనివాస్, పాల్వాయి హరీశ్ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. జిల్లా కేంద్రాలకు లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని తెలిపారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. దీంతో బస్సులకు డిమాండ్? పెరిగిందన్నారు. కొత్త రూట్లను పెంచుతున్నామని చెప్పారు. రాష్ట్రం ఏర్పాటు సమయంలో ఆర్టీసీలో 55వేల మంది ఉద్యోగులు ఉంటే.. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి 40వేల మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. 15 ఏండ్లు దాటిన బస్సును స్క్రాప్‌కు పంపిస్తున్నామని.. కొత్త బస్సులు కొంటున్నామని చెప్పారు. గతంలో 50 శాతం ఆక్యుపెన్సీ ఉండేదనీ, నేడు 100శాతం దాటుతోందని చెప్పారు. వేములవాడ-ధర్మపురి-కొండగట్టు ఆలయాలను కలపుతూ బస్సుల లింకింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కోరుట్ల, జగిత్యాల, సిరిసిల్లలకు బస్సులను పెంచుతామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఎరియర్స్ ఫండ్స్ రూ.280 కోట్లు చెల్లించామనీ, 21 శాతం పీఆర్సీ, కంపాసినేట్ అపాయింట్?మెంట్స్ చేస్తున్నామని తెలిపారు.

**చెన్నూరు డిపో ఏర్పాటుకు టెండర్లు :** చెన్నూరు బస్ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని మంత్రి పొన్నం చెప్పారు. అసెంబ్లీ క్వశ్చన్ అవర్‌లో ఎమ్మెల్యే వివేక్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. చెన్నూరు డిపో కోసం రూ.4 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు.

మెదటి విడతగా కోటి 20లక్షలు చెల్లిచామని, కాంపౌండ్ వాల్, బేస్మెంట్, గ్యారేజీ పనులు పూర్తయ్యాయని తెలిపారు. కానీ ఆర్టీసీకి సంబంధించిన భూమిపై హైకోర్టులో స్టే ఉన్నందున పనులు నిలిచిపోయాయని చెప్పారు. కోర్టులో స్టే వెకెట్ అయిన వెంటనే డిపో ఏర్పాటు చేస్తామని వివరించారు.




హైదరాబాద్: భేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహించాం. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాలపై అప్పీలుకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్న దాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం"అని పొంగులేటి తెలిపారు.

# రేవంత్.. సమరశంఖం

## మణిపూర్ అల్లర్లు - ఆదాని వివాదాలపై రోడ్డెక్కిన టీ కాంగ్రెస్

### చీకటి ఒప్పందంపై నోరు మెదపరేంటని ప్రశ్నించిన సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్ : దేశాన్ని పట్టి కుదిపేస్తోన్న మణిపూర్ హింసాత్మక పరిస్థితులు, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదాని వివాదాలపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమర శంఖాన్ని పూరించింది. హైదరాబాద్‌లో భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఛలో రాజ్ భవన్ పేరుతో టీపీసీసీ చేపట్టిన ఈ ర్యాలీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ర్యాలీకి నేతృత్వాన్ని వహించారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా రాజ్ భవన్ వరకు చేపట్టిన నిరసన ప్రదర్శన ఇది. రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇందులో పాల్గొన్నారు. ఈ ర్యాలీని పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. దీనితో రేవంత్ రెడ్డి రోడ్డుపైనే బైఠాయించారు. తన నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 75 సంవత్సరాల కాలంలో దేశ ప్రతిష్ఠను కాంగ్రెస్ పార్టీ ఇనుమడింపజేసిందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలకు పాల్పడి ప్రపంచం ముందు దేశ పరువు తీశారని ఆరోపించారు. అమెరికాకు సంబంధించిన సంస్థలకు అదానీ లంచాలు ఇచ్చారంటూ ఆ దేశ విచారణ సంస్థలు సైతం నివేదికలు ఇచ్చాయని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయినప్పటికీ- పార్లమెంట్‌లో కనీసం చర్చకు కూడా అవకాశం ఇవ్వట్లేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. దేశ పరువు ప్రతిష్టను మంటగలిపిన అదానీపై విచారణ చేపట్టాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో డిమాండ్ చేశారని అన్నారు. అయినప్పటికీ ప్రధాని మోదీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోన్నారని మండిపడ్డారు. అదాని అంశంపై మాట్లాడటానికి అధికార పక్షం ఎందుకు ముందుకు రావట్లేదని నిలదీశారు. అందుకే నేడు దేశ వ్యాప్తంగా రాజ్ భవన్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చిందని రేవంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వమే ధర్నాకు కూర్చోవడం కొందరికి నచ్చకపోవచ్చని, కొందరికి కడుపులో నొప్పి ఉండొచ్చని చురకలు అంటించారు రేవంత్ రెడ్డి. అదానీ అంశంపై కేసీఆర్, బీఆర్ఎస్.. తమ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమ వైఖరి ఏమిటో చెప్పకుండా కాంగ్రెస్‌ను అవహేళన చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీతో బీఆరెస్ చీకటి ఒప్పందంలో భాగంగానే ఆదానీపై వారు నోరు మెదపట్లేదని రేవంత్ తేల్చి చెప్పారు. అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీకి బీఆర్ఎస్ లొంగిపోయిందని ఆరోపించారు. అందుకే- ఆదానీపై గురించి మాట్లాడటానికి బీఆర్ఎస్ నేతలు ముందుకు రావట్లేదని అన్నారు. పార్లమెంట్‌లోనూ బీఆర్ఎస్ తమ పార్టీ విధానం ఏమిటో చెప్పాలని, వాళ్లు ప్రజల వైపు ఉంటారా? లేక అదానీ వైపా? అనేది చెప్పాలని రేవంత్ రెడ్డి అన్నారు. ఆదానీపై మాట్లాడితే తమను ఎక్కడ జైలులో పెడతారోననే భయం బీఆర్ఎస్ నేతల్లో ఉందని రేవంత్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమను విమర్శించడం కాదని, ఆదానీపై, జేపీసీపై వైఖరేంటో చెప్పాలని, ఎంపీలతో లేఖ రాయించాలని చెప్పారు. మోదీ, కేసీఆర్ వేర్వేరు కాదని, నాణేనికి బొమ్మ, బొరుసులాంటి వారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. జేపీసీపై డిమాండ్ చేస్తే శాసన సభలో తీర్మానం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశాన్ని దోచుకున్న ఆదానీపై జేపీసీ వేయడానికి ప్రధాని ఎందుకు సిద్ధంగా లేరని, అదానితో లాలూచీ ఏంది అంటూ నిప్పులు చెరిగారు. జేపీసీ వేయకపోతే అవసరమైతే రాష్ట్రపతి భవన్ వద్ద కూడా ధర్నా చేయడానికి తామందరం సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి అన్నారు. తన స్నేహితుడిని కాపాడటానికి ప్రధాని మోదీ శతవిధాలా ప్రయత్నిస్తోన్నారని, అయినా అది సాధ్యం కాబోదని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## 2024 వెళ్లిపోతోంది..

### మోదీ టూర్ చేసిన దేశాలు మనమూ చూసొద్దామా?

చూస్తూచూస్తూనే 2024 వెళ్లిపోతోంది.. కాలగర్భంలో మరో ఏడాది కలిసిపోతోంది.. మరొక్క రెండు వారాలే..? ఆ తర్వాత 2025. కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ఎంత ఉత్సాహంగా ఉన్నామో.. చెప్పాల్సిన పనిలేదు. అయితే, ఈ సంవత్సరంలో ఒక్క ట్రిప్ అయినా వేయని వారు ఎందరో..? ఏ యిజానికీ తక్కువ కానిదీ టూరిజం.. అందుకే, ఏడాదిలో ఒక్క టూర్ అయినా వేయాలంటారు. తద్వారా మనసు రీచార్జి అవుతుందని చెబుతారు. కానీ, ఎక్కడకు వెళ్లాలి..? ఏ దేశం చూడాలి..? ఏవో ఎందుకు? మన ప్రధాని మోదీ 2024లో పర్యటించిన దేశాలనే మనమూ చుట్టేస్తే..? అసలు ఆ దేశాలేమిటో తెలుసుకుంటే?

దాదాపు 80 దేశాలలో పర్యటించి 2014లో తొలిసారి ప్రధాని అయిన మోదీ ఈ పదిన్నరేళ్లలో దాదాపు 80 దేశాల్లో పర్యటించారు. ఏ భారత ప్రధానీ వెళ్లని మంగోలియా వంటి దేశాల్లోనూ పర్యటించారు. మొత్తమ్మీద మోదీ స్థాయిలో భారత ప్రధానులెవరూ టూర్ చేసి ఉండరనే చెప్పొచ్చు. మరో నాలుగున్నరేళ్ల పదవీ కాలంలో ఆయన ఎన్ని దేశాల్లో టూర్ చేస్తారో..? 2024లో మోదీ వెళ్లొచ్చిన దేశాలేమిటంటే..?

**రెండో నెలలనే..** 2024లోకి అడుగు పెడుతూనే మోదీ తొలి టూర్ చేశారు. ఫిబ్రవరిలో యూఏఈకి వెళ్లారు. పలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇటీవలి కాలంలో పర్యటకపరంగా యూఏఈ బాగా ఆకర్షిస్తోంది. దీంతోపాటు సంస్కరణలతో పెట్టుబడిదారులను ఆహ్వానిస్తోంది. అందుకే, విదేశీ టూర్ చేయాలనుకుంటే ఈ దేశం తొలి ఎంపికగా మారింది. మరీ ముఖ్యంగా అందరూ చూడాలని తపించే దుబాయ్.. యూఏఈలోనిదే.

భారతీయులే కాదు..పలు దేశాలకు చెందిన పర్యాటకులు వెళ్లే దేశం యూఏఈ.

**ప్రశాంత దేశంలో...** ట్రాఫిక్ రణగొణ ధ్వనులకు, సెల్ ఫోన్ భూతానికి దూరంగా.. ప్రశాంత జీవితానికి దగ్గరగా ఉండే బుల్లి దేశం భూటాన్. అక్కడి ప్రజలూ అంతే ప్రశాంతంగా ఉంటారు. ఆ దేశ ప్రధాని షెరింగ్ టోబ్ గే ఆహ్వానంతో మోదీ భూటాన్ వెళ్లారు. మన పక్కనే ఉండే భూటాన్ తక్కువ బడ్జెట్‌లో విదేశాలకు వెళ్లాలనుకునేవారికి మంచి ప్రదేశం.. వీసా లేకుండా భారతీయులు 14 రోజులు ఇక్కడ ఉండొచ్చు. అందమైన అడవులు, బౌద్ధారామాలను సందర్శించవచ్చు.

**ఇటలీ రమ్మంటోంది..** యూరప్ ఖండ దేశాల్లో ఇటలీ పర్యటకుల స్వర్గధామం. సినీ తారలు, వ్యాపార దిగ్గజాల ఫేవరెట్ దేశం. డెస్టినేషనల్ వెడ్డింగ్ లకు పెట్టింది పేరు. ఈ దేశంలోని వెనిస్ గురించి ఎంత చెప్పినా తక్కువే. 50వ జీ7 దేశాల సదస్సులో భారత్ కు ఆహ్వానిత దేశం కింద పిలుపు దక్కింది. దీంతో మోదీ ఇటలీలో పర్యటించారు. ఇక ఏటా ఇటలీని లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా ఈ దేశానికి వెళ్లాలనేది టూరిస్టుల లక్ష్యం. రోమ్, ఫ్లోరెన్స్, వెనిస్, అమాల్ఫీ కోస్ట్ తదితర ప్రదేశాలు ఇటలీలో పేరుగాంచినవి.

**చిరకాల మిత్ర దేశం రష్యా..** సోవియట్ యూనియన్ కాలం నుంచి భారత్ కు మిత్ర దేశం. రష్యా తర్వాత కాలంలోనూ అదే స్నేహాన్ని కొనసాగిస్తోంది. 22వ భారత్–రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి మోదీ మాస్కో వెళ్లారు. ఏటా ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు రష్యాను సందర్శిస్తుంటారు. భారీ పర్వతాలు, ఎడారులు, అందమైన బీచ్‌లు, వారసత్వ ప్రదేశాలు, రాజ భవనాలు, మంచు సరస్సులకు రష్యా పెట్టింది పేరు. రాజధాని మాస్కో, వ్లడివోస్టాక్ లు పర్యాటకులను బాగా ఆకర్షిస్తాయి.

**సింగపూర్ సిగలో..** నగర దేశం సింగపూర్. మన గ్రేటర్ హైదరాబాద్ కంటే కాస్త పెద్దది అంతే. కానీ, ప్రపంచ దేశాల్లో దీనికి చోటుంది. డెవలప్ మెంట్‌లో సింగపూర్ అందరికీ ఆదర్శం. మనకు కాస్త దగ్గర కూడా. మోదీ ఈ ఏడాది సింగపూర్ కూ వెళ్లారు. ఏటా లక్షల మంది సింగపూర్ లో పర్యటన చేస్తుంటారు. మ్యూజియం, జురాంగ్ బర్డ్ పార్క్, రెఫ్లెల్ పార్క్, జూలాజికల్ గార్డెన్, సైన్స్ సెంటర్ సెంటోసా ఐలాండ్, పార్లమెంట్ హౌస్, హిందూ, చైనీస్, బౌద్ధ దేవాలయాలు, చైనీస్, జపనీస్ గార్డెన్లను చూసి మైమరుస్తుంటారు.

# వ్యర్థాల్లో అర్థం.. పరమార్థం





హైదరాబాద్ : హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైన 'ఎకో సస్టెన్ ఎక్స్‌పో'లో వేర్వేరు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రతినిధులు తమ ఆవిష్కరణలు, పేటెంట్ పొందిన నమూనాలను ప్రదర్శించారు. గృహ, వాణిజ్యపరంగా ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలు, వ్యర్థజలాలను పునర్వినియోగించేలా రూపొందించిన ప్రోటోటైప్‌లను సందర్శకులకు వివరించారు. ఇందులో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువగా ఉపయోగపడే 'ఫుడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' (చగ్), 'డీసెంట్రలైజ్డ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

బయోగ్యాస్ తయారీ ఇలా.. కంపోస్ట్ పద్ధతికి భిన్నంగా 'అనెరోబిక్' పద్ధతిలో వ్యర్థాలను ఎరువులు, బయోగ్యాస్‌గా మారుస్తున్నారు. 50 కేజీల ఆహార వ్యర్థాలను వేస్తే 1 కేజీ ఎల్పీజీ గ్యాస్ పరిమాణంతో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయొచ్చని చెన్నైకి చెందిన ఎవిర్స్‌టెక్ సంస్థ ప్రతినిధి వి.భరత్ తెలిపారు. ఆహార వ్యర్థాలను 'అనెరోబిక్ డైజెషన్ పద్ధతిలో' తక్కువ సమయంలో ఎరువుగా మారుస్తుంది. ఇంట్లో రోజూ ఉత్పత్తి అయ్యే ఆహార వ్యర్థాలను ఫుడ్ క్రషర్‌లో వేయాలి. అనంతరం దానిని ఫుడ్ వేస్ట్ స్లర్రీ కోసం కేటాయించిన డ్రమ్ములో వేయాలి. దానికి అనుసంధానించిన ఫుడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అది పయనించి చగ్‌పై అమర్చిన రియాక్టర్‌లో బయోగ్యాస్, ఎరువులను తయారు చేస్తుంది. బయోగ్యాస్‌ను తక్కువ ఒత్తిడితో ఇంట్లో వినియోగించుకోవచ్చు. 'బ్లాక్‌గోల్డ్'గా పిలిచే ఎరువును ఇంట్లో గార్డెనింగ్‌కు వినియోగించొచ్చు లేదా విక్రయించొచ్చు. అపార్ట్‌మెంట్ సముదాయాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఆఫీసు క్యాంటీన్లలో వీటిని పెద్దఎత్తున వినియోగించొచ్చు.

3 కేఎల్‌డీ సామర్థ్యంతో ...

20 నుంచి 30 కుటుంబాలున్న అపార్ట్‌మెంట్లలో వ్యర్థ జలాల నిర్వహణ సరిగా ఉండటం లేదు. వీటికి పరిష్కారంగా కర్ణాటకకు చెందిన ఇన్నోవేటివ్ వాటర్ టెక్నాలజీస్ అంకుర సంస్థ 3 కేఎల్‌డీ సామర్థ్యంతో 'డీసెంట్రలైజ్డ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్'ను రూపొందించింది. తక్కువ ఖర్చులో వ్యర్థ జలాల నిర్వహణ, పునర్వినియోగించేలా దీనిని రూపొందించింది. రోజూ ఉత్పత్తయ్యే వ్యర్థజలాలను బయోజోన్ ట్యాంక్‌కు అనుసంధానం చేస్తారు. ఏరియేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత శుద్ధి చేసిన జలాలు ట్యూబ్ సెట్లర్ యూనిట్ లోకి వెళ్తాయి. ఇక్కడ రెండోసారి శుద్ధి చేసి డోసింగ్ పంపుల ద్వారా క్లోరినేషన్ చేస్తారు. అనంతరం శాండ్ ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసి పంపుతారు. ఈ నీటిని గార్డెనింగ్ తదితరాలకు వినియోగించొచ్చు. సెట్లింగ్ ట్యాంక్‌లో మిగిలిపోయిన వ్యర్థాలు స్లడ్జ్ ట్యాంక్‌లో ఉండిపోతాయి. వాటిని తీసేయొచ్చు.

# కిడ్నీ బాధితులకు భరోసా



కోరుట్ల: డయాలసిస్ కేంద్రాలు గతంలో కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉంటుండేవి. కిడ్నీ వ్యాధిగ్రస్థులు మూడు రోజులకొకసారి వెళ్లి రక్తం శుద్ధి చేయించుకోవడం తీవ్ర ఖర్చుతో కూడుకొని ఉండేది. ప్రైవేటు ఆసుపత్రిలో ఖర్చుతోపాటు రవాణా వ్యయం భారమయ్యేది. ఆర్థికంగా ఉన్నవాళ్లు మాత్రమే సక్రమంగా చికిత్స చేయించుకునేవారు. నిరుపేదలు తరచూ వెళ్లే వీలుకాకపోవడంతో ప్రాణాలు కోల్పోయేవారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ కేంద్రాన్ని కోరుట్లలో ఏర్పాటు చేయడంతో కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన రోగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. 2016 నుంచి ప్రభుత్వం ఉచిత బస్‌పాస్‌తోపాటు నెలకు రూ.2016 ఆసరా పింఛన్ అందజేస్తోంది.కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 2023 జనవరి 5న డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, డీసీడీసీ కిడ్నీ కేర్ సంయుక్తంగా సేవలు అందించాలని నిర్ణయించారు. ముందుగా 5 రక్తశుద్ధి యంత్రాలను సమకూర్చడంతో ఆసుపత్రి పైఅంతస్తులో ప్రత్యేక విభాగంలో కేంద్రం ఏర్పాటు చేసి ఫిబ్రవరి 5 నుంచి రోగులకు డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇటీవల మరో 5 యంత్రాలను ప్రభుత్వం కేటాయించడంతో మొత్తం 10 యంత్రాల ద్వారా నిత్యం 30 మందికిపైగా రోగులకు రెండు విడతల్లో డయాలసిస్ చేస్తున్నారు.

100 మందికిపైగా చికిత్స

కోరుట్ల డయాలసిస్ కేంద్రంలో మొత్తం 100 మందికిపైగా కిడ్నీ బాధితులు నమోదు చేయించుకున్నారు. రోగులకు వైద్య సేవలందించేందుకు కేంద్రం మేనేజర్, 13 మంది టెక్నీషియన్లు ఉన్నారు. వీరు ఉదయం 5.30 నుంచి రాత్రి 12 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు 30 మందికిపైగా రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఒక్కొక్కరికి 4 గంటల సమయం పడుతుంది. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నుంచి నెఫ్రాలజీ వైద్యులు టెలీమెడిసిన్ ద్వారా ఎప్పటికప్పుడు రోగుల రిపోర్టు ఆధారంగా చికిత్స అందిస్తుంటారు. అత్యవసర సమయంలో ఆసుపత్రిలోని ఇతర వైద్యులు చికిత్స చేస్తుంటారు. ఇప్పటివరకు 10,000లకుపైగా షిఫ్టుల్లో రోగుల రక్తం శుద్ధి చేశారు. ప్రతి రోగికి కొత్త వైద్య పరికరాలను అమర్చి చికిత్స చేస్తుంటారు. ఇక్కడ చికిత్స పొందిన ఆరుగురు కిడ్నీ వ్యాధిగ్రస్థులు కిడ్నీ ట్రాన్స్‌ప్లానింగ్ చేయించుకున్నారు. మరో నలుగురు ట్రాన్స్‌ప్లానింగ్ చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

మాది ఇబ్రహీంపట్న మండలం డబ్బా గ్రామం. నేను హోటల్ నడుపుతుంటాను. ఆరేళ్ల కిందట నా కిడ్నీలు చెడిపోయాయి. అప్పటి నుంచి ఇతర పట్టణాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకునే వాడిని. కోరుట్లలో కేంద్రం ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి మూడు రోజులకు ఒకసారి వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాను. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నాను.

సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం అందుబాటులో ఉండటంతో నిత్యం కిడ్నీ రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. రోజుకు 30 మందికిపైగా రోగులకు డయాలసిస్ చేస్తున్నాం. 50 మంది వరకు వినియోగించుకునే వీలుంది. నిత్యం వైద్యుల పర్యవేక్షణలో టెక్నీషియన్లు రక్తం శుద్ధి చేస్తుంటారు.– సునీతారాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# నాలుగేళ్లుగా క్వింటా కొంటే ఒట్టు

వేములవాడ: గతంలో రైతులు పండించిన పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలతో కళకళలాడిన వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రస్తుతం అస్తిత్వం కోల్పోయింది. నాలుగేళ్ల క్రితం కొనుగోలు చేసిన ధాన్యమే చివరి కొనుగోళ్లు అయ్యాయి. గతంలో ప్రతి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం, కందులు, మక్కలు, పత్తి క్రయ,విక్రయాలతో ఈ మార్కెట్ సందడిగా ఉండేది. అలాంటిది గత పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డు అలంకారప్రాయంగా మారింది.

వేములవాడ చుట్టు పక్కల మండలాలైన బోయినపల్లి, కోనరావుపేట, రుద్రంగి మండలాల రైతులు పండించిన పంట ఉత్పత్తులను ఇక్కడికి తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం ఆ ఆనవాళ్లు కనిపించడం లేదు. వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 10 కోట్లు వెచ్చించి రైతుల కోసం అన్ని సదుపాయాలు కల్పించారు.

యార్డు మొత్తం సీసీ నిర్మాణం, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకునేందుకు గోదాంలు, రైతులకు విశ్రాంతి గది నిర్మించారు.ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించేందుకు రైతు సమాచార కేంద్రం ఏర్పాటు చేశారు.

మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి వంటి అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం ఇవన్నీ నిరుపయోగంగా మారాయి.

**ప్రతిపాదనల్లోనే కొత్తది**

వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డు దాదాపు అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో నాలుగేళ్ల క్రితం రెండు ఎకరాల స్థలాన్ని వేములవాడ మున్సిపల్‌కు అప్పగించారు. ఈ స్థలంలో మున్సిపల్ నిధులు రూ.4.50 కోట్లతో సమీకృత కూరగాయలు, మాంసం విక్రయ మార్కెట్ కోసం భవన నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఇక్కడ వ్యవసాయ మార్కెట్‌కు స్థలం సరిపోదని గ్రామీణ మండలంలోని మర్రిపల్లిలో దాదాపు 13 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు ప్రతిపాదనలు చేసి స్థలాన్ని



పరిశీలించినప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు.

**దళారులదే ఇష్టారాజ్యం**

వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయించేందుకు రైతులు పంట ఉత్పత్తులను తీసుకురావడం లేదనే కుంటిసాకుతో మార్కెట్ కమిటీ అధికారులు తప్పించుకుంటున్నారు.

మార్కెట్ పరిధిలో దాదాపు 20 మంది లైసెన్స్ పొందిన వ్యాపారులు ఉన్నారు. వీరంతా గ్రామాల్లో కాంటాలు పెట్టి తూకాలు చేస్తున్నారే తప్పా యార్డులో కొనుగోళ్లు చేసిన దాఖలాలు లేవు.

దళారులు, కొంత మంది లైసెన్స్ వ్యాపారులు పెద్ద ఎత్తున గ్రామాల్లో ధాన్యం, పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ అన్నదాతలను నిలువునా ముంచుతున్నారు. తూకం వేసే కూలీలతో జత కట్టి క్వింటాల్‌కు 5 నుంచి 10 కిలోల వరకు మోసానికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

గ్రామాల్లో మార్కెట్ అధికారులు, తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేసిన సందర్భాలు లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా మోసాలు జరుగుతున్నాయి.

## చలో రాజ్ భవన్ కు తరలి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

శామీర్ పేట, (గరుడ వార్త) : చలో రాజ్ భవన్ కార్యక్రమానికి శామీర్ పేట, మూడు చింతలపల్లి మండలాలతో పాటు తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి శామీర్ పేట మండలం లోని తూముకుంట మున్సిపల్, శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలం నుంచి బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.అమెరికాలో గౌతమ్ అధాని పై వచ్చిన ఆర్థిక అవకతవకలు దేశ వ్యాపార, ఆర్థిక రంగాలలో పరువును దెబ్బతీసాయని గో అధాని పై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్



మనిపులేషన్ లాంటి అంశాలలో ఆయనపై ఆరోపణలు దేశ ప్రతిష్టను దెబ్బతీసాయన్నారు. అలాగే మణిపూర్ లో వరసగా జరిగిన అల్లర్లు, విధ్వంసాలపై మోడీ ఇప్పటి వరకు అక్కడకు వెల్లకపోవడంలాంటి అంశాలపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి ర్యాలీలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఎస్ జి ఎఫ్ ఖో- ఖో పోటీలకు జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థుల ఎంపిక

శామీర్ పేట, (గరుడ వార్త) : జాతీయస్థాయి ఖో ఖో పోటీలకు తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్నికైనట్లుగా పీఈటి సత్తిరెడ్డి తెలిపారు. బుధవారం సత్తిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల తాండూరు పట్టణంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల ఖో ఖో అండర్– 17 బాలుర విభాగంలో తుంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థులు 9వ తరగతి చదువుతున్న కృపా శేఖర్, 8వ తరగతి చదువుతున్న ఆదిత్య లు ఉ



త్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన చెప్పారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి, ఉపాధ్యాయ అభినందించారు.

## బిల్లులు రావు.. పోషకాలు లేవు!

గోదావరిఖని : 'పిండి కొద్దీ రొట్టె' అన్నారు పెద్దలు.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిస్థితి కూడా అలాగే తయారయింది.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో నిర్వాహకులు ఆహారంలో పోషకాలను పక్కన పెడుతున్నారు.. గోరుచుట్టుపై రోకటి పోటులా నిత్యావసరాల ధరలు మండుతుండటంతో పలుచని చారు.. తక్కువ ధర కూరలతో సరిపుచ్చుతున్నారు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,500 మంది వరకు మధ్యాహ్న భోజన నిర్వాహకులున్నారు. ఒక్కొక్కరికి రూ.60 వేల నుంచి రూ.2 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9, 10 తరగతులకు సంబంధించి గత విద్యా సంవత్సరం చివరి నెల బకాయిలు కూడా ఇంకా రావాల్సి ఉంది. దీంతో అప్పులు తెచ్చి.. అరువులకు సరకులు తీసుకుని భోజనం వండాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. మరోవైపు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. మెనూ ప్రకారం భోజనం చేస్తే ఒక్కో విద్యార్థికి కనీసం రూ.15 ఖర్చవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. తక్కువ విద్యార్థులు ఉ



న్న పాఠశాలల్లో కొంత వరకు ఖర్చు తక్కువగా ఉన్నా, విద్యార్థులు ఎక్కువ ఉన్న పాఠశాలల్లో ఆర్థిక భారమవుతోంది. దీంతో నిర్వాహకులు తక్కువ ధరలో వచ్చే ఆలుగడ్డ ఇతర కూరగాయలతో వంటలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉదయం విద్యార్థులకు రాగి జావ ఇవ్వాలని నిర్ణయించినా అందుకు సంబంధించి నిధులు రాకపోవడంతో నిర్వాహకులు తయారు చేయడం లేదు. దీంతో ఆ పోషకాహారమూ అందడం లేదు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, వర్కర్లు తమకు నెలలుగా వేతనాలు, బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల డీఈవోలు జనార్దన్‌రావు, మాధవి, జగన్‌మోహన్‌రెడ్డి, రమేశ్‌లు మాత్రం ఎప్పటికప్పుడు బిల్లులు తయారు చేసి ట్రెజరీకి పంపుతున్నామని చెప్పారు. జూన్ వరకు బిల్లులు విడుదలయ్యాయని జులైవి త్వరలో విడుదలవుతాయని చెప్పారు. కాగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు మాత్రం తమకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరైతేనే మెనూ అమలు చేయగలమని, అప్పులు చేసే పరిస్థితి రాదని పేర్కొంటున్నారు.

# నాణ్యమైన చదువు.. నైపుణ్యాల నెలవు

పెద్దపల్లి : పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' కింద పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో క్యాంపస్‌లు నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో తొలి విడతలో మంథని, మానకొండూర్‌లలో శంకుస్థాపన చేశారు. సమీకృత గురుకులాలు అందుబాటులోకి వస్తే విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు అవకాశం ఉంది. ఈ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధించనున్నారు.

**అన్ని వర్గాల పిల్లలకూ ఒకే చోట..**

కుల, మత, వర్గాల వారీగా అమలులో ఉన్న గురుకుల విద్యా విధానాన్ని ఒకే చట్రం కిందకు తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం సమీకృత గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాలు, పాఠశాలలు నిర్వహిస్తూ ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇకపై అన్ని వర్గాల విద్యార్థులకు ఒకే చోట బోధిస్తారు. కుల, మత రహిత సమాజం నిర్మాణానికి ఈ యువ భారత్ సమీకృత పాఠశాలలతో అడుగులు పడనున్నాయి.

**ఇష్టమైన రంగాల్లో రాణించేలా శిక్షణ**



పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా సమీకృత గురుకులాల్లో బోధన ఉంటుంది. విద్యార్థులను చదువుల యంత్రం మాదిరిగా కాకుండా వివేకవంతుడిగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో బోధిస్తారు. పిల్లల అభిరుచికి తగ్గట్లుగా వారికి ఇష్టమైన రంగంలో రాణించేలా శిక్షణ ఇచ్చేలా పాఠశాలలను అభివృద్ధి చేయనున్నారు.

**ఎనిమిది చోట్ల స్థలాల ఎంపిక**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమీకృత గురుకులాలకు ఉమ్మడి జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో స్థలాల ఎంపిక జరిగింది. మంథని మండలం అడవిసోమన్‌పల్లి, తిమ్మాపూర్ మండలం యాదవనగర్‌లలో భవనాల నిర్మాణానికి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు శంకుస్థాపన చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లి, రామగుండం నియోజకవర్గంలో అంతర్గాం, ధర్మపురిలో వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, జగిత్యాలలో చల్‌గల్, కోరుట్లలో జమ్మిగద్ద ప్రాంతం, చొప్పదండి నియోజకవర్గంలో గంగాధరలలో ప్రాథమికంగా స్థలాలను గుర్తించారు. రెండో విడతలో మిగిలిన నియోజకవర్గాల్లో స్థలాలను ఎంపిక చేసే అవకాశముంది.

**అధునాతన వసతులు**

ఒక్కో సమీకృత గురుకులంలో 2,560 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. వీరికి బోధించేందుకు 120 మంది ఉపాధ్యాయులుంటారు. గ్రంథాలయంలో 5 వేల పుస్తకాలు, 60 కంప్యూటర్లతో ల్యాబ్, అన్ని తరగతుల్లో డిజిటల్ బోర్డులుంటాయి. వసతిగృహాల్లో ప్రతి డార్మిటరీ గదికి పది బెడ్లు, రెండు స్నానాల గదులు ఉండేలా రూపకల్పన చేశారు. 20–25 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలంలో క్యాంపస్‌లు నిర్మిస్తూ తరగతి గదులు, ల్యాబొరేటరీలు, కంప్యూటర్ కేంద్రం, గ్రంథాలయం, ఆడిటోరియం, ఇండోర్ స్పోర్ట్స్, క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులు, అవుట్‌డోర్ జిమ్, థియేటర్, ల్యాండ్‌స్కేప్ కోర్టులుంటాయి.

# యాసంగి సాగు... ఉపాధి బాగు

కోనరావుపేట : ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో జలాశయాలు, చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు ఆశించిన మేర అందుబాటులో ఉండటంతో రైతులు యాసంగి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో సుమారు 1.7 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. నారు మడులు వరినాట్లకు సిద్ధమవ్వగా వ్యవసాయ క్షేత్రాలను రైతులు ట్రాక్టర్లతో జోరుగా దమ్ము చేస్తున్నారు. దీంతో పెట్రోల్ బంకుల్లో డీజిల్ అమ్మకాలు సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు అయ్యాయి. రైతులు ఎరువులు సమకూర్చుకుంటున్నారు. మరోవైపు వ్యవసాయ, బోరుబావులు, పంపుసెట్ల మరమ్మతులు చేయిస్తున్నారు. కొన్ని చోట్ల వరినాట్లు మొదలు కాగా స్థానికంగా ఉన్నవారితోపాటు బిహార్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన వలస కూలీలకు చేతినిండా పని లభిస్తోంది. రోజుకు ఒక్కొక్కరికి రూ.300–400 వరకు కూలి గిట్టుబాటు అవుతుంది. గుత్తకు అయితే ఎకరానికి రూ.4,500–5000 వరకు తీసుకొంటున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో ఇలా వివిధ వర్గాల వారికి ఉపాధి లభిస్తుండటంతో ఆదాయం మెరుగుపడుతుంది. ఈ చిత్రంలో కనిపిస్తున్న కోనరావుపేట మండల బావుసాయిపేటలోని ఓ పెట్రోల్ బంకులో సాధారణ రోజుల్లో డీజిల్ రోజుకు 750 నుంచి 950 లీటర్ల విక్రయాలు జరుగుతుంటాయి. యాసంగి సీజన్‌కు సంబంధించి వరినాట్లు మొదలు కావడంతో పది రోజులుగా 1800 నుంచి 2000 లీటర్ల అమ్మకాలు జరుగుతున్నాయి. రెట్టింపు విక్రయాలు మరో నెల రోజుల పాటు కొనసాగనున్నాయి. వ్యవసాయ క్షేత్రాలను దమ్ము చేయటానికి ట్రాక్టర్లు రోజంతా నడవటంతో ఒక్కో ట్రాక్టర్ యజమాని 30 లీటర్ల వరకు కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు ఎరువుల బస్తాలు తరలించడం, వరినాట్లు వేయటానికి కూలీలను వ్యవసాయ క్షేత్రాలకు తరలిస్తుండటంతో డీజిల్ విక్రయాలు జోరందుకున్నాయి.

**సీజన్‌లో రూ.30-40 వేల ఆదాయం** నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. యాసంగిలో బోరుబావి సహాయంతో సాగు చేస్తున్నాను. మా గ్రామానికి ఆనుకుని మూలవాగు ఉండటంతో నీటి సదుపాయం ఉంది. సొంత వ్యవసాయ భూమితో పాటు, చుట్టు పక్కల రైతుల వ్యవసాయ క్షేత్రాలను దమ్ము చేయడంతో సీజన్‌లో మొత్తం ఖర్చులు పోను రూ. 30–40 వేలు పైగా మిగలనున్నది. దీంతో వ్యవసాయ సాగు పెట్టుబడికి, ట్రాక్టర్ నిర్వహణకు వానాకాలం వరిసాగు వరకు ఈ ఆదాయం ఉపయోగపడుతుంది. **జెట్టి విజయ్, ట్రాక్టర్ యజమాని, వట్టిమల్ల** రెండు నెలల పాటు... గ్రామంలో వ్యవసాయ, బోరుబావుల విద్యుత్తు మోటార్ల మరమ్మతు పనులు చేస్తుంటాను. యాసంగి సీజన్ పనులు ప్రారంభం కావటంతో రెండు నెలల పాటు చేతినిండా ఉపాధి లభిస్తోంది. విద్యుత్తు మోటార్ల మరమ్మతు, విద్యుత్తు తీగలు సరిచేయడం, ఇతరత్రా పనులు సాగుతుంటాయి. సాధారణ రోజుల్లో ఖర్చులు, అద్దె పోను నెలకు రూ.4–5 వేల ఆదాయం రాగా, సీజన్‌లో రూ.10–15 వేల ఆదాయం వస్తుంది.

# ఏడాది దాటినా.. మట్టి, కంకరే!



తాండూరు : తాండూరు–చించోళి అంతర్ రాష్ట్ర రహదారిని కేంద్ర సర్కారు 2022లో జాతీయ రహదారిగా ప్రకటించింది. నిధులుకూడా మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. ఇప్పుడు 2024 డిసెంబరు. నేటికీ పూర్తిస్థాయిలో పనులు సాగక వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

**అన్ని విధాల ప్రయోజనమని ఆశిస్తే..**

తాండూరు–చించోళి మార్గం ఒకవైపు కర్ణాటక రాష్ట్రం మన్నెక్కెల్లి వద్ద ముంబయి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉంది. మరోవైపు మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ వద్ద బెంగళూరు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉంది. తాండూరు–చించోళి మార్గాన్ని జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తే రాకపోకలకు మరింత సౌకర్యంగా మారుతుందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి నం.167 నిర్మించేందుకు 2022లో నిధులు మంజూరు చేసింది. వెంటనే పనులు చేపట్టారు. తొలుత పట్టణం, శివారులో గౌతాపూర్ నుంచి రాశులపురం దాకా తారు రోడ్ల విస్తరణ చేపట్టారు. ఇరువైపులా కాల్వల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఇందిరాచౌక్ సమీపంలో జాతీయ రహదారిపై మురుగు నీరు పారుతుండటంతో అపరిశుభ్రత నెలకొంది.

**తారు పనులకు తాత్సారం**

అల్లాపూర్ నుంచి కోటబాస్పల్లి వరకు నాలుగు వరసల రహదారి నిర్మించేందుకు ఒకవైపు పనులు మొదలయ్యాయి. పది కి.మీ. పొడవునా పనులు చేపట్టి కొంత ఎర్రమట్టి, కంకర పరిచారు. ఏడాది దాటినా తారు పనులు ప్రారంభించడం లేదు. వంతెన పనులు అసంపూర్తిగా ఉంచారు. రహదారి మధ్యలో కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు తొలగించాల్సి ఉండగా అమలు కాలేదు.

**నిత్యం 4,000కు పైగా వాహనాల రాకపోకలు**

ప్రతిరోజు 4వేలకుపైగా వాహనాల రాకపోకలు సాగిస్తుండగా అసంపూర్తి రహదారితో అవస్థలు పడుతున్నారు. సిమెంటు, నాపరాయి లారీలు, ట్యాంకర్ల రాకపోకల సమయంలో పెద్దఎత్తున దుమ్ము లేస్తుండటంతో మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది. మట్టి, కంకర మీదుగా ప్రతిరోజు ట్యాంకర్లతో నీరు చల్లాల్సి ఉండగా గుత్తేదారు పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే అల్లాపూర్, సిరిగిరిపేట, రాంపూర్, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి తదితర గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా పనులు వేగంగా నిర్వహించి తారు పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

జాతీయ రహదారి నం.: 167
మంజూరైన నిధులు: రూ.631కోట్లు
దూరం: 42.5 కి.మీ.
ప్రదేశం: కొత్లాపూర్ నుంచి దుద్యాల వరకు
పనులు మొదలు: రెండు సంవత్సరాల క్రితం

# గోదారి ఇసుక తరలుతోంది

రాయికల్ : గోదావరి తీర గ్రామాలు ఇసుక అక్రమ రవాణాకు అడ్డాలుగా మారాయి. జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి వద్ద ప్రారంభమయ్యే గోదావరి నది మల్లాపూర్, రాయికల్, సారంగాపూర్, ధర్మపురి మండలాల మీదుగా ప్రవహిస్తోంది. నదిలోని ఇసుకను రోజంతా ట్రాక్టర్లలో రహస్య ప్రాంతంలో నిలువ చేసి రాత్రి వేళల్లో టిప్పర్లలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లితో పాటు నిర్మల్, నిజామాబాద్ పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడపాదడపా పోలీసులు, రెవెన్యూ అధికారులు టిప్పర్లు, ట్రాక్టర్లను పట్టుకుంటున్నప్పటికీ ఇసుక దందాను నియంత్రించలేకపోతున్నారు. ప్రస్తుత కలెక్టర్ బాధ్యతలు చేపట్టినప్పుడు ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపగా తర్వాత పట్టించుకోకపోవడంతో ఇసుక అక్రమ వ్యాపారులు చెలరేగిపోతున్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులు మామూళ్లతో సరిపుచ్చుకుంటున్నారనే విమర్శలున్నాయి.

**టిప్పర్లలో పట్టణాలకు తరలింపు**

మండలంలోని ఒబులాపూర్, పాతదాంరాజుపల్లి, వాల్గొండ, వెంకట్రావుపేట గ్రామ శివారులోని గోదావరి తీర ప్రాంతాల్లో రోజంతా ఇసుకను ట్రాక్టర్లతో తీసుకొచ్చి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రి వేళ జేసీబీల సాయంతో ఇసుకను టిప్పర్లలో లోడ్ చేస్తూ పట్టణ ప్రాంతాలకు చేరవేస్తున్నారు. మైనింగ్‌శాఖ అధికారులు ఇసుక రీచ్‌లను గుర్తించకపోవడం ఇసుక అక్రమర్కులకు కాసులు కురిపిస్తోంది. నిత్యం వందల సంఖ్యలో ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లాలో ప్రవహిస్తున్న గోదావరి తీర ప్రాంతాల్లో గ్రామాభివృద్ధి కమిటీ వేలం నిర్వహిస్తున్నప్పటికీపోలీసులు మౌనంగా ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కేసులు నమోదు చేసినా..**

మండలంలోని కోమటి కొండాపూర్, ఎర్దండి గ్రామాల్లోని గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారు జామున ఇసుకను ట్రాక్టర్లలో నింపి ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. గత నెలలో కోమటి కొండాపూర్ గ్రామంలో పలు చోట్ల ఇసుక డంపులు, ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రాలీలను రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టుకున్నారు. ఇసుకను సీజ్ చేసి, కేసు నమోదు చేసినప్పటికీ మళ్లీ ఇసుకను అక్రమార్కులు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని, తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ట్రాక్టర్‌కు రూ.3 వేలు**

రాయికల్ మండలంలోని బోర్నపల్లి, జగన్నాథపూర్ గోదావరి తీరం, మూటపల్లి, కొత్తపేట, ఇటిక్యాల పెద్దవాగు, చింతలూరు అటవీ ప్రాంతాల నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. రాత్రి అయితే చాలు అక్రమార్కులు ఇసుకను గ్రామాలు అక్కడి నుంచి పట్టణాలకు తరలిస్తున్నారు. ఒక్కో ఇసుక ట్రాక్టరు రూ.2000 నుంచి రూ.3000 వరకు విక్రయించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అనాధికారికంగా వేలం వేసి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. గతంలో మాదిరి తహసీల్దారు కార్యాలయాల్లో గృహ నిర్మాణాలకు ఇసుక తరలించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతున్నారు.

**ఎల్లంపల్లి నీటితో ఇబ్బంది..**

ధర్మపురి మండలంలో గోదావరి తీర ప్రాంతంలో గతంతో పోలిస్తే ఇసుక అక్రమ రవాణా తగ్గుముఖం పట్టింది. నదీ తీర గ్రామాల్లో ఎల్లంపల్లి నీరు ధర్మపురి ఎగువ ప్రాంతం వరకు ఉండటమే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. నీరు అధికంగా ఉండటంతో వాహనాలు లోపలికి వెళ్లకపోవడం, అధికారుల నిఘా పెరగడం, నిల్వఉంచిన ఇసుకనే దళారులు గుట్టు చప్పుడు కాకుండా అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక నిలువలు కూడా ఒకటి రెండు గ్రామాల్లోనే ఉన్నాయి. జిల్లా కలెక్టర్ పలు చోట్ల దాడులు చేసి ఇసుక డంపులను పెద్ద ఎత్తున స్వాధీన పరచుకున్నారు. మండలంలోని ఒక గ్రామంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించినా, ఇసుకను తీసుకోవడానికి, ఆన్‌లైనులో దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపలేదు. గతంలో ఉదయం, పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగేది.

**టిప్పర్‌కు రూ.10 వేలు**


గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలింపు నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. బీర్‌పూర్ మండలంలో రంగసాగర్, మంగెళ, కమ్మునూర్, చిత్రవేణిగూడెం, రేకులపల్లె, చిన్న కొల్వాయి మీదుగా గోదావరి ప్రవహిస్తుంది. ఆయా గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని చిన్న కొల్వాయి కేంద్రంగా ఇసుక అక్రమ తరలింపు వ్యాపారంగా మారింది. ట్రాక్టర్ యజమానులు పొద్దంతా ఇసుకను ఒడ్డుకు చేర్చితే రాత్రి కాగానే టిప్పర్ల ద్వారా జగిత్యాలకు తరలిస్తున్నారు. టిప్పర్ నింపి పంపితే ట్రాక్టర్ యజమానికి రూ.10 వేల వరకు చెల్లిస్తున్నారు. దీంతో ట్రాక్టర్ యజమానులే దగ్గరుండి ఇసుకను టిప్పర్లలో నింపి తరలిస్తున్నారు. అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

# తాళం వేశారు.. అక్రమాలు మూసేశారు

హైదరాబాద్: ప్రభుత్వ భూములను ఆక్రమించి జీవో నంబర్ 59తో క్రమబద్ధీకరించుకోవాలని యత్నించిన అక్రమార్కులకు చెక్‌పెట్టేందుకు వారి దరఖాస్తులు ఆమోదించేందుకు వీల్లేకుండా సర్కారు తాళం వేసింది. రెవెన్యూ ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలు బాగానే ఉన్నా.. భూ కబ్జాదారులు ఎన్ని ఎకరాలు ఆక్రమించుకున్నారు? ఎవరు సహకరించారు? క్రమబద్ధీకరించుకునేందుకు రూ.కోట్లలో రెగ్యులరైజేషన్ రుసుం ఎలా చెల్లించారు? అన్న అంశాలపై ఇప్పటికీ విచారణ చేపట్టలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి తాఖీదులు, విచారణలు లేకపోవడంతో కొందరు అక్రమార్కులు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, గండిపేట్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్ మండలాల్లో జీవో నంబర్ 59 క్రమబద్ధీకరణలో పలు అక్రమాలు జరిగాయి.

**జీవో నంబర్ 59 దుర్వినియోగం**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నవారికి ఆయా స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు జీవో నంబర్ 59 ద్వారా కల్పించిన అవకాశాన్ని కొందరు భూ కబ్జాదారులు అక్రమాలకు వినియోగించుకున్నారు. 125 చదరపు గజాల కంటే ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తే వ్యక్తుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్న నిబంధనను అనువుగా మార్చుకున్నారు. రిజిస్ట్రేషన్ ధరల ప్రకారం రుసుం చెల్లించాలని, రుసుంను మూడు వాయిదాల్లో చెల్లించేందుకు సర్కారు



అంగీకరించింది.

**ఎకరాల్లో తాత్కాలిక నిర్మాణాలు..**

రిజిస్ట్రేషన్ సొమ్మును ఎలాగూ చెల్లిస్తున్నాం కదా అనుకున్న భూ కబ్జాదారులు రోజుల వ్యవధిలో ప్రణాళికను అమలు చేశారు. గండిపేట, శేరిలింగంపల్లి మండలాల్లో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. కోకాపేటలో చిన్న, చిన్న డబ్బాలను నిర్మించి కొందరు పేదల పేర్లతో గతేడాది మార్చిలో దరఖాస్తులు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఆ దరఖాస్తులను ఆమోదించారు. ఈ ఏడాది మార్చిలో రంగారెడ్డి కలెక్టర్ కె.శశాంక దరఖాస్తుల ఆమోదంలో అక్రమాలున్నాయని గుర్తించి క్రమబద్ధీకరణను రద్దు చేశారు. కోకాపేటలో మాత్రమే ఆక్రమణలు ఆగిపోగా... మిగిలిన ప్రాంతాల్లో దరఖాస్తులు అలాగే ఉన్నాయి.

# ఖర్చు భరించేదెట్లా..!

నాంపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంటోంది. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం సైతం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసిన యంత్రాంగం బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో పల్లెపోరుపై గ్రామాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. మునుగోడు ఉపఎన్నిక, గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఆయా పార్టీల తరఫున ఇంటింటికీ వెళ్లి స్థానిక నాయకులే విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేశారు.

**గతం తలచుకుంటే గుబేల్**

ఇప్పుడు సర్పంచి ఎన్నికల్లో తమవంతు వచ్చింది. ఆ ఖర్చును ఎలా గట్టెక్కాలా.. అంటూ సర్పంచి ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ఆయా ఎన్నికల్లో అన్ని పార్టీల అభ్యర్థులు స్థానిక నాయకుల చేతుల మీదుగానే ఖర్చు చేయించారు. డబ్బు, మద్యం పంపిణీ వారి ఆధ్వర్యంలోనే సాగింది. ఇప్పుడు సర్పంచి ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ ఖర్చు తల్చుకొని బెంబేలెత్తిపోతున్నారు.



మునుగోడు ఉప ఎన్నిక అత్యంత ఖరీదైన ఎన్నికగా దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం కాగా.. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ అభ్యర్థులు భారీ మొత్తంలో ఖర్చు చేసినట్లు అంచనా. నామినేషన్ వేసింది మొదలు పోలింగ్ రోజు వరకు ప్రచార ఖర్చు, కార్యకర్తలకు భోజనాలు, మద్యం, ప్రచారానికి రోజువారి కూలీ చెల్లించి జనాన్ని రప్పించడం, చివరికి ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి తాయిలాలు, డబ్బు పంపిణీ, ముఖ్య నాయకులు, అనుచరుల అలకలు తీర్చేందుకు అ'ధన'పు చమురు ఇలా మొత్తం తడిసి మోపెడయింది. ఖర్చంతా అభ్యర్థులే భరించినా.. డబ్బు వెళ్లింది మాత్రం స్థానిక నాయకుల చేతుల మీదుగానే. ఇప్పుడు సర్పంచి బరిలో నిలిస్తే జనాన్ని ఓట్లడగాలంటే.. ఏమిస్తావని ప్రజలు అడిగే అవకాశముందని భావిస్తున్నారు.

**పెరిగిన అంచనాలు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1770 గ్రామ పంచాయతీలున్నాయి. సర్పంచిగా పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు చిన్న గ్రామాల్లో కనీసం రూ.25 లక్షలు, పెద్ద గ్రామాల్లో అయితే రూ.40 నుంచి రూ.50 లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితులున్నాయి. మండలకేంద్రాల్లో అయితే రూ.కోటి నుంచి కోటిన్నర వరకు ఖర్చు తప్పదని ఆశావహులే పేర్కొంటున్నారు. ఇటీవలి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థులు చేసిన ఖర్చు వీరిని కలవర పెడుతోంది. గత శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థుల తరఫున పెత్తనం చేసిన నాయకులు చూపిన బాటలోనే ప్రస్తుతం ఓటర్లు నడుస్తామంటున్నారు. ఆ ఎన్నికల్లో ఓటుకు ఇంతిచ్చారు.. ఇప్పుడెంతిస్తారో చూద్దాం.. అనే చర్చలు గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. అప్పుడు పెత్తనం చేసిన చేతులే ఇప్పుడు స్వయంగా ఓట్లడగాల్సి ఉంటుంది. దీంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలంటే ఎంత ఖర్చు చేయాలో అంటూ ఆశావహులు వాపోతున్నారు.

# అభివృద్ధి చేసి.. నిర్లక్ష్యంగా వదిలేసి

నల్గొండ: పులిచింతల ప్రాజెక్టు నిర్మాణంలో పాక్షికంగా ముంపునకు గురైన మట్టపల్లిలో బాధితులకు పునరావాసం కల్పించేందుకు 2005లో 106 కుటుంబాల కోసం సర్వే సంఖ్య 540లో 10.20 ఎకరాలు కేటాయించారు. 2013లో ఇక్కడ సుమారు రూ.2 కోట్లతో కనీస వసతులు కల్పించడంతో పాటు ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవనం, గ్రామ పంచాయతీ కార్యాలయం వంటి నిర్మాణాలు పూర్తి చేశారు. విద్యుత్తు లైన్లు, వీధి దీపాలు, నియంత్రికలు ఏర్పాటు చేశారు. మునక జాబితాలో ఉన్న వారి ఇళ్లకు పరిహారం సైతం అందజేసి అభివృద్ధి చేసిన పునరావాస కేంద్రంలో ఇళ్లు కట్టుకునేందుకు స్థలాలను కేటాయించారు. కాగా అప్పట్లో బాధితులు స్వగ్రామాన్ని విడిచి వచ్చేందుకు అసక్తి చూపక పోవడంతో దశాబ్ద కాలంగా పునరావాస కేంద్రం పడావు పడింది. కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. సీసీ రహదారులు, డ్రైనేజీలు శిథిలమయ్యాయి. ప్రభుత్వ భవనాలు పగుళ్లతో రూపురేఖలు కోల్పోయాయి. భవనాల్లోని ఫ్యాన్లు, దర్వాజాలు, కిటికీలు చోరీకి గురయ్యాయి.

ఇదీ బాధితుల డిమాండ్.. శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో అర్చకులతో పాటు ఇక్కడే జీవనోపాధి పొందుతున్న స్థానికులు స్వగ్రామాన్ని విడిచి 4కి.మీ.లకు పైగా దూరంలో ఉన్న పునరావాస కేంద్రానికి రావడానికి ఇష్టపడటం లేదు. ఈ కారణంగానే ఇప్పటి వరకు ఒక్క ఇల్లూ నిర్మించుకోలేదు. ప్రస్తుతం ఉంటున్న గ్రామంలోని పైభాగంలో సర్వే నం.1లో తమకు స్థలాలు ఇవ్వాలని దశాబ్ద కాలంగా ముంపు బాధితులు కోరుతున్నారు. స్థానికులంతా ఒకే చోట ఉంటామని, రెండు గ్రామాలుగా ఎలా ఉంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పునరావాస కేంద్రానికి వెళ్లేది లేదని తేల్చి చెబుతున్నారు. ప్రభుత్వం తమ విషయంలో న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యను పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళతామన్నారు. వారి ఆదేశాల మేరకే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

## సైబర్‌క్రైమ్ ఠాణా.. సమయం దాటితే హైరానా

హైదరాబాద్: ఆపదలో ఉన్నా, అన్యాయం జరిగినా ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది పోలీస్‌స్టేషన్. అర్ధరాత్రి వెళ్లినా పోలీసులు ఆదుకుంటారని ప్రతి ఒక్కరికి భరోసా. అలాంటి ఠాణా లోపలికి వెళ్లడానికి, అధికారుల్ని కలవడానికి సమయం నిర్దేశిస్తే.. పరిస్థితేంటి? రాష్ట్రంలోనే అత్యధికంగా సైబర్‌క్రైమ్ కేసులు నమోదయ్యే సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో సరిగ్గా ఇదే జరుగుతోంది. ఈ ఠాణాలో ఇన్‌స్పెక్టర్లను కలిసేందుకు నిర్దేశిత వేళలు నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. కేసు పురోగతి తెలుసుకోవడానికి, ఎఫ్‌ఐఆర్ ప్రతి తీసుకోవడానికి రోజూ సాయంత్రం 4- 6 గంటల మధ్య మాత్రమే రావాలని సిబ్బంది సూచిస్తున్నారు. పొరపాటున ఈ సమయం దాటితే ఫిర్యాదుదారులను లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. సైబర్ నేరాల్లో రూ.లక్షలు, రూ.కోట్లు పోగొట్టుకుని తిరిగి డబ్బు ఎప్పుడు వస్తుందోననే ఆశతో ఎంతో దూరం నుంచి వచ్చిన తమను సమయం మించిపోయిందని అడ్డుకోవడమేంటని బాధితులు వాపోతున్నారు. దీని వెనుక ఓ అధికారి ఆదేశాలున్నట్లు సమాచారం.




**ప్రత్యామ్నాయం చూపకుండా నిబంధనేంటి?**

గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ ఆవరణలోనే సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఉంది. సైబర్ నేరంలో రూ.50 వేల కంటే తక్కువ మొత్తంలో కోల్పోతే స్థానిక శాంతిభద్రతల పోలీస్‌స్టేషన్‌లో, అంతకంటే ఎక్కువ మొత్తంలో పోగొట్టుకుంటే సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయాలి. సైబర్‌క్రైమ్ ఠాణాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 9,400లకుపైగా కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఇతర పోలీస్ యూనిట్లతో పోలిస్తే ఇక్కడే అత్యధికంగా సైబర్ నేరాలు నమోదవుతున్నాయి. సైబర్ నేరాలపై ఫిర్యాదులకు ఎలాంటి ఆంక్షల్లేకున్నా కేసు పురోగతి వివరాలు తెలుసుకోవడానికి నిర్దేశిత సమయాలు పెట్టడం సమస్యగా మారింది. సాధారణ నేరాలతో సైబర్ నేరాల పరిస్థితి విభిన్నం. డబ్బు కోల్పోయాక సకాలంలో నేరస్థుల ఖాతాలు ఫ్రీజ్ చేసి బాధితులు పోగొట్టుకున్న డబ్బు తిరిగి వాపస్ ఇచ్చే విధానముంది. దీనికి పోలీసులు చట్టపరమైన ప్రక్రియ పూర్తిచేయడంతో పాటు కోర్టు అనుమతి, బ్యాంకులు ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయడం ఇలా అనేక దశలుంటాయి. దీనికి రోజుల తరబడి సమయం పడుతోంది.

## ఆరోగ్య మహిళా కేంద్రాలకు నిరాదరణ

హైదరాబాద్ : గ్రేటర్‌లో మహిళల కోసం గతంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాల చిరునామా కన్పించడం లేదు. నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతి మంగళవారం మహిళలకు సేవలు అందేలా ఈ కేంద్రాలను వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసింది. 90 యూపీహెచ్‌సీల్లో అందుబాటులోకి తెచ్చారు. వీటిపై ప్రచారం లేకపోవడంతో ఆదరణ కోల్పోయి.. ప్రస్తుతం అరకొరగా నడుస్తున్నాయి. మహిళల్లో వచ్చే జీవనశైలి వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి చికిత్స అందించే ఉద్దేశంతో వీటిని ప్రారంభించారు. ముఖ్యంగా అధిక బరువు, ఊబకాయం, గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్లు, మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ ఇతర జీవనశైలి వ్యాధులకు ఈ కేంద్రాల్లో చికిత్సలందించేవారు. దీనివల్ల క్యాన్సర్ లాంటి వ్యాధులను ముందే పసిగట్టి చికిత్సలు అందించడానికి వీలుంటుంది. రక్త ఇతర పరీక్షల కోసం శాంపిళ్లు సేకరించి వాటిని నారాయణగూడ తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రానికి పంపుతారు. రొమ్ము, నోటి, గర్భాశయ ముఖ క్యాన్సర్లకు సంబంధించి లక్షణాలు కన్పిస్తే...అలాంటి వారిని ఎంఎన్‌జే ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రికి పంపిస్తారు. అనంతరం ఉచితంగానే ఔషధాలు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం సాధారణ ఓపీని నిర్వహిస్తున్నారు. జీవనశైలి వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించడం లేదని రోగులు చెబుతున్నారు.

**ఈ పరీక్షలు చాలా అవసరం...**


ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళల్లో చాలామందికి ఆరోగ్యంపై అవగాహన ఉండటం లేదు. మెనోపాజ్ తర్వాత హార్మోన్ల సమతుల్యతతో రకరకాల శారీరక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మహిళల్లో క్యాన్సర్ల ముప్పు పెరుగుతోంది. ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో ఏటా 1500 రొమ్ము క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. మరో 1200 వరకు గర్భాశయ క్యాన్సర్‌తో వైద్యులను సంప్రదిస్తున్నారు. ఇందులో 80 శాతం మంది వ్యాధి ముదిరే దశలో వస్తున్నారు. ముందే స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా ఈ రెండు క్యాన్సర్లను గుర్తించే అవకాశం ఉంది. తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నివారించే అవకాశం ఉంది. ఇక చాలామందికి బీపీ, షుగర్ లాంటి సమస్యలున్నప్పటికీ గుర్తించలేకపోతున్నారు. కొందరైతే ఏడాదికి ఒకసారి కూడా పరీక్షలు చేయించుకోవడం లేదు. అధిక రక్తపోటు కారణంగా కొన్నిసార్లు పక్షవాతం, గుండె జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది.

## వానర దండుతో ప్రజల బెంబేలు

మంథని : వానరాలతో మంథని పట్టణంతో పాటు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి.. రహదారులు, ఇళ్లు తేడా లేకుండా అవి సంచరిస్తుండటంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.. వానరాల దాడుల్లో చాలా మంది గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారు. మంథని–కాటారం, మంథని–ముత్తారం రహదారులకు ఇరువైపులా కోతులు తిష్ట వేయడంతో వాహనదారులు, నడుచుకుంటూ వెళ్లేవారు భయాందోళనకు గురవుతున్నారు. పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. కోతుల బెడదతో కూరగాయలు.. ఇతర చిన్న పంటల సాగుదారులు, వ్యాపార సముదాయాల నిర్వాహకులు నష్టపోతున్నారు. **అటవీ ప్రాంతం కావడంతో..**మంథని నియోజకవర్గంలో గాడుదుల గండి గుట్ట సమీపంలో, మంథని–ముత్తారం ప్రాంతంలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి కోతులను తీసుకొచ్చి ఇక్కడ వదిలేస్తున్నారు. వాటికి అడవుల్లో ఆహారం దొరకక రోడ్లు.. గ్రామాల బాట పడుతున్నాయి. రోడ్ల వెంట వెళ్ళే పలువురు వాహనదారులు తినుబండారాలు, ఆహార పదార్థాలు వేస్తుండటంతో అవి ఆశగా అక్కడే ఉంటున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆహారం కోసం వాహనదారులపైకి వెళ్లడంతో వారు కిందపడి గాయాలపాలవుతున్నారు. కోతుల బెడదకు కిరాణ దుకాణదారులు రూ.వేలతో గ్రిల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు.

**నివారణ చర్యలు** మంథని అటవీ డివిజన్ పరిధిలో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తే వానరాల బాధ కొంతైనా తగ్గుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు రహదారులపై తినుబండారాలు, ఆహార పదార్థాలు నిర్ణీత ప్రదేశాల్లో వేసేలా చర్యలు తీసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చు. అదే విధంగా మూగ జీవాలు బలికాకుండా చూడవచ్చు.

# నిధులు రాక.. పనులు సాగక



హైదరాబాద్ :ప్రాజెక్టుల ప్రారంభంలో ఉన్నంత హడావుడి... కేంద్రం నిధులు విడుదల చేసే సమయంలో చూపించదు. నింపాదిగా నిధులు ఇవ్వడంతో పనులు ముందుకు సాగలేకపోతున్నాయి. ముఖ్యమైన నిర్మాణ ప్రాజెక్టులకు రుణాలు మంజూరు కాకపోవడంతో మరికొన్ని ప్రాజెక్టులు పట్టాలెక్కడం లేదు.

**తప్పని జాగు:** మెట్రో మరో దశ ప్రాజెక్టు పనులను మొదలు పెట్టాలన్నా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును వేగంగా ముందుకు కదలించాలన్నా కూడా కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాల్సిందే. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలను ఇస్తున్నారు. వీటిపై కేంద్రం వేగంగా నిర్ణయాలను తీసుకోవడం లేదు.

**ఇదీ కీలకం:** నగరంలోని అన్ని ప్రాంతాలకు మెట్రోను విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అయిదు కారిడార్లలో 76.4 కి.మీ పొడవున మెట్రో లైను నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందులో కేంద్రం రూ.4230 కోట్లను భరించాలని రాష్ట్రం కోరుతోంది. మిగిలిన మొత్తంలో రూ.7311 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే మరో రూ.1030 కోట్లను నిర్మాణ సంస్థ భరించేలా ప్రణాళికను రూపొందించారు. మిగిలిన మొత్తాన్ని రుణం కింద సమీకరించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం నిర్ణయం తీసుకోలేదు.

**మూసీ ప్రణాళికపై స్పందనేదీ..?**

మూసీ పునరుజ్జీవ పథకంలో నార్సింగి నుంచి బాపూఘాట్ వరకు 22 కి.మీ పొడవున ప్రాజెక్టును మొదలు పెట్టాలని నిర్ణయించారు. స్మారక మందిరంతోపాటు అతి పెద్ద బాపూ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తలపెట్టారు. ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకు రెండు రకాల అనుమతులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రాంతంలో రక్షణ శాఖకు 222 ఎకరాలు ఉంది. ప్రత్యామ్నాయ ప్రణాళికతో రక్షణ శాఖకు చేసిన ప్రతిపాదనలపై స్పందన లేదు. ప్రాజెక్టు వ్యయంలో రూ.3500 కోట్లను కేంద్రం ఇవ్వాలని రాష్ట్రం కోరుతోంది. దీనిపై ఇంకా నిర్ణయం రాలేదు.

రాజధానిలో మురుగు రోడ్లపైకి రాకుండా ఉండాలంటే బల్దియా పరిధిలో 2600 కి.మీ కొత్త డ్రైనేజీ వ్యవస్థను రూపొందించాలని నివేదికను రూపొందించింది. బాహ్యవలయ రహదారి వరకు మరో 4600 కి.మీ మేర కొత్తగా భూగర్భ డ్రైనేజీతోపాటు మురుగు శుద్ధి కేంద్రాలను రూపొందించాలని కోరింది. దీనికి రూ.17,212 కోట్ల వ్యయం అవుతుంది. ఇందులో 50 శాతం నిధులు భరించాలని కేంద్రాన్ని కోరింది.

రాష్ట్ర, జాతీయ రహదారులపై రెండు ఆకాశమార్గాల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చినా.. వీటికి రుణం మంజూరు కాకపోవడంతో ఇంకా పనులు మొదలుకాలేదు.

ఒకటి సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బండ్ జంక్షన్, బోయినపల్లి జంక్షన్ మీదుగా నిర్మాణానికి రూ.1580 కోట్లు అవుతుంది.

ప్యారడైజ్ నుంచి తూముకుంట వరకు ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.2,232 కోట్లు కావాలి. ఇప్పటి వరకు ఏ సంస్థతోనూ నిధులకు ఒప్పందం చేసుకోలేదు.

# బంధువులుగా చేరి.. పెళ్లింట చోరీ



హైదరాబాద్ : కాఫీలు తాగారా.. టిఫీనీలు చేశారా! ఒక సినిమాలో పెళ్లింట ఆహ్వానం పలుకుతూ ఆత్మీయత ఒలకబోస్తారు. చివర్లో విలువైన వస్తువులు కొట్టేసే దొంగలుగా బయటపడతారు. అలా వెండితెరపై నవ్వించిన పాత్రలు.. ప్రస్తుతం వివాహాది శుభకార్యాలు జరుగుతున్న చోటికి చేరి అదను చూసి అందినంత కాజేసి మాయమవుతున్నారు. షేక్‌పేట్‌లోని ఓ ఫంక్షన్ హాలులో వివాహ వేడుకలో అందరూ హడావుడిగా ఉన్నారు. అక్కడ ఇద్దరు మహిళలు చక్కగా ముస్తాబై పెళ్లికూతురి గదిలోకి వెళ్లి కొద్దిసేపయ్యాక బయటకు వచ్చారు. ఆ తర్వాత ఆ గదిలో బంగారు నెక్లెస్ మాయమైనట్టు గుర్తించారు. సీసీటీవీ కెమెరా ఫుటేజీలో ఆ ఇద్దరు మహిళలు హడావుడిగా బయటకు వెళ్లినట్టు కనిపించారు. తాజాగా ఆసిఫ్‌నగర్‌లో వివాహం జరిగే ఇంట 20తులాల బంగారం మాయమైంది. కుటుంబసభ్యులు పెళ్లిపనుల్లో నిమగ్నమై ఉండటాన్ని ఆసరాచేసుకొని దగ్గరి బంధువులే చోరికి పాల్పడినట్టు గుర్తించిన పోలీసులు నిందితులనుఅరెస్ట్ చేశారు.

**ఆత్మీయులుగా నటిస్తూ..**


కొద్దిరోజులుగా మహానగరంలో ఎటుచూసినా పెళ్లిసందడే. ఖరీదైన ఇంట వివాహమంటే వారంరోజుల ముందు నుంచే హంగామా.. అక్కడికి వచ్చిన వారిలో బంధుమిత్రుల ఎవరనేది గుర్తించటం సవాల్. వధూవరుల కుటుంబసభ్యులు పెళ్లి పనుల్లో బిజీగా ఉంటారు. అక్కడక్కడ ప్రైవేటు భద్రతా సిబ్బంది ఉన్నా చూసీచూడనట్టు వదిలేస్తారు. దీన్ని అవకాశం చేసుకున్న మాయగాళ్లు తెలివిగా వివాహ మండపం వద్దకు చేరుతున్నారు. అతిథులు మాదిరిగానే పెళ్లిపీటలపై వధూవరులను ఆశీర్వదిస్తారు. కడుపారా భోజనంచేసి నెమ్మదిగా చేతివాటం ప్రదర్శిస్తారంటూ నగరానికి చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తాజాగా దక్షిణమండలం పరిధిలో వ్యాపారి కుమారుడి వివాహం జరిగింది. వరుడి మిత్రుడినంటూ చేరిన ఓయువకుడు.. ఇద్దరు సెల్‌ఫోన్లు కొట్టేసి మాయమయ్యాడు. ఆదిభట్ల పరిధిలో ఫంక్షన్‌హాలులో జరిగినపెళ్లిలో రూ.40వేల నగదు, 20తులాల బంగారు నగలున్న బ్యాగు మాయమైంది. మధ్యప్రదేశ్, యూపీ, మహారాష్ట్రకు చెందిన కొన్ని ముఠాలు బంధువులుగా చేరి చోరీలకు పాల్పడుతున్నట్టు పోలీసులు భావిస్తున్నారు.

**బంగారు నగలు.. సెల్‌ఫోన్లు**

గతంలో అంతరాష్ట్ర దొంగ ఫంక్షన్‌హాళ్లలో పనివాడిగా చేరి చోరీలకు పాల్పడ్డాడు. అందరూ పెళ్లిపనుల్లో ఉంటే ఇతడు వధువు, వరుల గదుల్లోకి వెళ్లి విలువైన ఆభరణాలు కాజేసి మాయమయ్యేవాడు. వాటిని రిసీవర్‌కు అప్పగించి

మరో ప్రాంతాన్ని ఎంచుకునేవాడు. నగరం, శివారు ప్రాంతాల్లో సుమారు 20కు పైగా చోరీలకు పాల్పడిన ఇతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా వేడుకల్లో హల్‌చల్ చేస్తున్న ముఠాలు స్వర్ణాభరణాలు, సెల్‌ఫోన్లు లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేస్తున్నాయని సైబరాబాద్‌కు చెందిన ఒక ఏసీపీ తెలిపారు. ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులకు ముందుగానే సమాచారం ఇచ్చామని.. కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని చెప్పినట్టు వివరించారు.

# జనం చూపు జనరిక్ వైపు.. 80 శాతం వరకు రాయితీతో ఔషధాలు




హైదరాబాద్ : జనరిక్ మందులకు (%Generic Medicine%) ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ దవాఖానాల వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద రోగుల రద్దీ కన్పిస్తోంది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల నుంచి నిత్యం వందలాది మంది రోగులు మందులు కొనుగోలు చేస్తున్నారు. తాజాగా పార్లమెంట్‌లో కేంద్రం సమర్పించిన నివేదికలో సరాసరి రోజూ 77 మంది జనరిక్ ఔషధాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపింది. బ్రాండెడ్ మందుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మున్ముందు జనరిక్‌కు ఆదరణ పెరగనుంది.

**బ్రాండ్ లేకుండా.. తక్కువకే**

సాధారణ జ్వరం వస్తే వినియోగించే ఔషధం పారాసిటమాల్. వైద్యుడి దగ్గరకు వెళ్తే మందుల చిట్టీలో ఇది కాకుండా ఏదో ఒక బ్రాండ్ పేరు రాస్తారు. మందుల దుకాణానికి వెళ్లి అదే బ్రాండ్ మందు తీసుకొని వాడుకోవడం అందరమూ చేస్తుంటాం. వాస్తవానికి పారాసిటమాల్ అనేది జనరిక్ పేరు. బ్రాండ్ లేకుండా అతి తక్కువ ధరకే జన ఔషధ షాపుల్లో పొందే వీలు ఉంటుంది.

పేదలకు భరోసా...: గాంధీ, ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల రద్దీ ఇతరత్రా కారణాలతో కొన్ని మందులు లభించడం లేదు. ఆరు మందులు రాస్తే.. నాలుగే ఇస్తున్నారు. మిగతావి బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఉస్మానియా, గాంధీలో ప్రైవేటు మెడికల్ షాపులు రోజుకు రూ.2-3 లక్షలు వరకు మందులను విక్రయిస్తున్నారు. ఈ తరుణంలో పేద రోగులకు జనరిక్ ఔషధ దుకాణాలు ఆదుకుంటున్నాయి.

**ధరల్లో భారీ వ్యత్యాసం...**

సాధారణ బ్రాండెడ్ మందులకు జనరిక్ ఔషధాలకు ధరల్లో ఎంతో వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు నొప్పి నివారణకు వాడే ఒక ప్రముఖ బ్రాండ్ 10 మాత్రలు రూ.55-70 పైనేమాటే. అదే 10 మాత్రలు జనరిక్ స్టోర్‌లో కేవలం రూ.10-15 లోపే. ఇక 100 ఎంఎల్ దగ్గు సిరప్ బ్రాండ్‌ది అయితే రూ.50-60 వరకు ఉంటుంది. అదే జనరిక్‌లో కేవలం రూ.20లోపే లభిస్తుంది. కొన్ని రకాల మందులైతే 80 శాతం తక్కువకే లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం రోగుల చికిత్సకు అయ్యే వ్యయంలో 40-50% వరకు ఔషధాల ఖర్చు ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్యులు సైతం జనరిక్ మందుల వాడే విధంగా రోగులను ప్రోత్సహించాల్సి ఉంది.

## అంతరం తగ్గితేనే అవసరం తీరేది!

ధర్మారం : ఉమ్మడి జిల్లాలో కూరగాయల అవసరాలకు, సాగుకు మధ్య భారీగా అంతరం నెలకొంది.. ఒకప్పుడు క్వింటాళ్ల కొద్దీ పండించిన రైతులు ఇప్పుడు ఇంటి అవసరాలకు సంతకు వెళ్లి కొనుక్కుంటున్నారు.. కూలీల కొరత, వన్యప్రాణుల బెడదతో సాగు విస్తీర్ణం ఏటికేడు తగ్గుతోంది. రాష్ట్రంలో ఏడాదంతా కూరగాయలు పండించేందుకు వీలుగా ఉద్యాన శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రైతులకు ప్రోత్సాహకాలతో పాటు నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. ఉపాధిహామీని అనుసంధానించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు పరిస్థితులపై ప్రత్యేక కథనం.

**అవసరం టన్నుల్లో..అందుబాటు క్వింటాళ్లలో**

కరీంనగర్ జిల్లా అవసరాలకు కనీసం 10 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పండించాలి. ఈ ఏడాది కేవలం 640 ఎకరాల్లో సాగు చేసినట్లు పంటల నమోదు వివరాలు వెల్లడిస్తున్నాయి. కరీంనగర్ గ్రామీణ, తిమ్మాపూర్, చొప్పదండి మండలాల రైతులు పండించిన కూరగాయలు నగరానికి వస్తున్నాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం జగిత్యాల జిల్లాకు రోజుకు 76 టన్నుల కూరగాయలు కావాలి. ఇందుకు కనీసం 3 వేల ఎకరాల్లో పండించాల్సి ఉండగా పది శాతానికే పరిమితమయ్యాయి. సగానికి పైగా అవసరాలకు దిగుమతులే ఆధారం.

జగిత్యాల సమీపంలోని శంఖులపల్లి, తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట, అంతర్గాం, లింగంపేట, ఎల్దుర్తి గ్రామాల్లో గతంలో వందల ఎకరాల్లో కూరగాయలు సాగయ్యేవి. ప్రస్తుతం నిజామాబాద్, ఆర్మూర్, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా, మహారాష్ట్ర నుంచి దిగుమతి అవుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలో ధర్మారం, ఓదెల, శ్రీరాంపూర్,



సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో ఎక్కువగా తీగజాతి రకాలు పండిస్తున్నారు. ఇక్కడి నుంచి ఎక్కువగా మంచిర్యాల, కరీంనగర్, జగిత్యాల, హైదరాబాద్ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా నీలోజిపల్లిలో పండిన కూరగాయలు ఎక్కువగా వేములవాడకు వచ్చేవి. ఆ గ్రామం మధ్య మానేరు జలాశయంలో ముంపునకు గురి కావడంతో ప్రస్తుతం పట్టణ శివారులోని కోనయ్యపల్లి తదితర గ్రామాల నుంచి వస్తున్నాయి.

ధర్మపురి మండలం నేరెళ్ల, స్తంభంపల్లి, తుమ్మెనాల గ్రామాల్లో కూరగాయలు సాగు చేస్తూ జగిత్యాల, ధర్మపురి, లక్షెట్టిపేట, మంచిర్యాల మార్కెట్లకు తరలిస్తున్నారు. వన్యప్రాణుల బెడద, కూలీల కొరత తదితర కారణాలతో ఏటికేడు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది.

**ధరలు తగ్గగానే మానేయడం సరికాదు**

నేను 13 సంవత్సరాలుగా కూరగాయలు సాగు చేస్తున్నా. ఎకరానికి తగ్గకుండా వివిధ రకాలు పండిస్తున్నా. ధరలు తగ్గితే చాలా మంది మరుసటి ఏడాది సాగు మానేస్తున్నారు. అలా చేయకుండా కొనసాగిస్తే లాభాలకు అవకాశం ఉంటుంది. వర్షాకాలం మొదట్లో బీర సాగు చేసి అంతర పంటగా చిక్కుడు, కాకర వేస్తాం. బీర పంట అయిపోగానే చిక్కుడు, కాకర దిగుబడులు మొదలవుతాయి. జనవరి, ఫిబ్రవరిలో టమాట సాగు చేస్తే వేసవిలో చేతికందుతుంది.కొమురెల్లారెడ్డి, బంజరుపల్లి

**ఎనిమిదెకరాల వరికి సమానం**

25 ఏళ్లుగా కూరగాయలు పండిస్తున్నా. ఎకరా సాగు ఎనిమిదెకరాల వరి పంటతో సమానం. కీలకమైన బిందు సేద్యం పరికరాలను ఒకసారి రాయితీపై ఇస్తే తిరిగి ఏడేళ్ల వరకు ఇవ్వడం లేదు. కూరగాయల సాగులో ఈ నిబంధన సవరించాలి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో నష్టం వాటిల్లుతోంది. అలాంటి సందర్భాల్లో పంటల బీమా వర్తింపజేస్తే భరోసా ఉంటుంది. విత్తనాలు, పనిముట్లు రాయితీపై అందించాలి.కళ్లెం కరుణాకర్‌రెడ్డి, బంజరుపల్లి

ఏటా మూడెకరాలకు తగ్గకుండా సాగు

అమ్మ రత్నవ్వ ఇరవై ఏళ్లుగా కూరగాయలు పండిస్తోంది. వివిధ రకాల ఆకు కూరలను ధర్మారం వారసంతలో విక్రయిస్తోంది. ఆమె ప్రోత్సాహంతో 15 ఏళ్లుగా కూరగాయలు పండిస్తున్నా. ప్రస్తుతం ఒకటిన్నర ఎకరంలో వేసిన టమాట తోట కాతకు వచ్చింది. పది గుంటల్లో అలసంత కాత మొదలైంది. కొంత విస్తీర్ణంలో వంగ, పొలం చుట్టూ సొర పాదులు నాటాం. ఏటా మూడెకరాలకు తగ్గకుండా పండిస్తున్నా. మల్చింగ్ కవర్లు, బిందు, తుంపర సేద్యం, పందిళ్లు రాయితీపై ఇస్తే బాగుంటుంది.

గడ్డం మహిపాల్‌రెడ్డి, బొమ్మారెడ్డిపల్లి

ఈ ఏడాది సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) ఇలా..

పెద్దపల్లి 366 రాజన్నసిరిసిల్ల 340 కరీంనగర్ 640 జగిత్యాల 322

## నిర్వహణ కొరవడి.. సమస్యల ఒరవడి

కొడంగల్ :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని ముడిమ్యాలలో ఏడేళ్లుగా ఓ అద్దె భవనంలో కొనసాగుతోంది. అంతకుముందు ఆ భవనంలో ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల ఉండేది. అది మూతపడడంతో భవనాన్ని అద్దెకు తీసుకొని గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు. అందులోనే ఇంటర్ కళాశాల కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 532 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. అయితే అద్దె భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ నెట్టుకొస్తున్నారు. తరగతి గదుల గోడలు బీటలు వారడంతో పాటు ఫ్లోర్ టైల్స్ పగిలిపోయాయి. కిటికీలకు అద్దాలు లేవు. చాలినన్ని మరుగుదొడ్లు లేవు. ఉన్న వాటి తలుపులు విరిగిపోయాయి.మురుగు వ్యవస్థ లేకపోవడంతో ఆవరణలోనే ఓ గుంత తీసి అందులోకి వదులుతుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని భవన యజమాని దృష్టికి తీసుకెళ్తే.. మరమ్మతులు చేయించలేనని.. ఖాళీ చేయాలని చెబుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. సమస్యను సాంఘిక సంక్షేమ గురుకులాల ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లామని చెబుతున్నారు. 500 మందికి పైగా విద్యార్థులు ఉండటంతో వారికి సరిపడా అద్దె భవనం ఎక్కడా దొరకడం లేదని అధికారులంటున్నారు. గురుకుల ప్రిన్సిపల్ పాండు నాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి మరో భవనంలోకి మార్చితే బాగుంటుందని ఆయన తెలిపారు.

# కుళాయి కనెక్షన్లలో.. కానరాని పారదర్శకత!

చెన్నూరు : ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో నల్లా కనెక్షన్లను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు మూడేళ్ల నుంచి కసరత్తు చేస్తున్నారు. కొన్నిచోట్ల పూర్తయినా మరికొన్ని చోట్ల కాకపోవడంతో ఇప్పటికీ రసీదుల విధానం కొనసాగిస్తున్నారు. ఫలితంగా అక్రమాలకు తావిచ్చే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 3 లక్షలకు పైగా కనెక్షన్లు ఉండగా.. వాటన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇది పూర్తయితే ప్రతి ఆస్తిపన్నుతో పాటు నల్లా బిల్లులు అందులో కనిపించే అవకాశముంటుంది. తద్వారా అక్రమాలకు చెక్ పడనుంది. కొన్నిచోట్ల పలువురు నాయకులు, అధికారులు చెప్పగానే ఎక్కడ కుళాయి కనెక్షన్ కావాలంటే అక్కడ ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో బల్దియాల ఆదాయానికి గండి పడుతోంది. డిపాజిట్ల రూపంలో, నెలవారీ రుసుం చెల్లించకుండా జాప్యమవుతోంది.

**ఇంటి నంబరు నమోదు చేస్తే..**

గతంలో నల్లా కనెక్షన్ల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయకపోవడంతో సమస్యలు ఎదురయ్యేవి. కొంతమంది బిల్లులు చెల్లించినా డిమాండ్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో ఫిర్యాదులు వచ్చేవి. వీటన్నింటిపై దృష్టిసారించిన పురపాలకశాఖ అన్ని సంఘాల్లో ఆన్‌లైన్



విధానంలో నల్లా బిల్లులు, కొత్త కనెక్షన్ల జారీ ప్రక్రియ చేపడుతోంది. ఇంటి నంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఇంట్లో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయనేది తెలుస్తుంది. మరోవైపు గత ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు డిజిటల్ ఇంటి నంబర్లు ఏర్పాటు చేస్తే ఇంటిపన్నుతో పాటు విద్యుత్తు, నల్లా బిల్లులు అనుసంధానం కానున్నాయి.

**కొత్త పురపాలికల్లో పాత విధానమే**

పాత బల్దియాల్లో ఆన్‌లైన్ విధానంలో కుళాయిల మంజూరు బాగానే ఉన్నా.. కొత్తగా ఏర్పాటైన వాటిల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. మూడేళ్లలో కేవలం రెండంకెల సంఖ్య కూడా దాటకుండా ఆన్‌లైన్ ద్వారా కనెక్షన్లు ఇచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొత్త వాటిల్లో ఇప్పటికీ మాన్యువల్‌గానే కనెక్షన్లు ఇస్తున్నారు.

**రసీదులు ఎప్పుడైనా లభ్యం**

కొత్తగా నల్లా కనెక్షన్ తీసుకునే వారికి బిల్లులు చెల్లించేందుకు పుస్తకాలు ఇవ్వడం లేదు. నల్లా కనెక్షన్ నంబర్ లేదంటే ఇంటి నంబర్ నమోదు చేయడంతోనే కుళాయి కనెక్షన్ వివరాలు, బిల్లుల చెల్లింపు చూపిస్తోంది. వీటికి సంబంధించిన రసీదులు ఎప్పుడైనా తీసుకునే వీలుంది. పుర కార్యాలయానికి వచ్చి నల్లా బిల్లు చెల్లించాలనే నిబంధన ఏమీ లేదు. ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా చెల్లించవచ్చు.

**మార్గదర్శకాలు ఇస్తాం**

మురళీకృష్ణ, కమిషనర్, చెన్నూరు పురపాలిక

ఆస్తిపన్ను చెల్లింపు నుంచి నల్లా బిల్లుల వరకు సేవలన్నీ ఆన్‌లైన్ ద్వారానే చేపడుతున్నాం. కొత్తగా నల్లా కనెక్షన్ కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. మున్సిపాలిటీల్లో ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి.

# ధాన్యం రైతుల దైన్యం..!

పెనుబల్లి : ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా ధాన్యం క్రయవిక్రయాలు ఆశించిన స్థాయిలో జరగటం లేదు. ఈసారి సర్కారు, మిల్లర్ల మధ్య చర్చలు కొలిక్కిరాకపోవటంతో సమస్య ముదురుతోంది. ఈక్రమంలో అన్నదాతలు తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పటంతో ఎక్కువ మంది అన్నదాతలు సన్నరకాలను సాగుచేసిన విషయం విదితమే.

**చర్చలు కొలిక్కి వచ్చేనా..?**

ఖమ్మం జిల్లాలో 64, భద్రాద్రి జిల్లాలో 42 మిల్లులకు ధాన్యం కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. సన్నాలు, దొడ్డురకాలు తేడా లేకుండా ప్రతి క్వింటా వడ్లకు 67 కిలోల బియ్యాన్ని మిల్లర్లు తిరిగి అప్పగించాలని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఆదేశాలున్నాయి. సాధారణంగా క్వింటా దొడ్డు రకం వడ్లకు 67 కిలోల బియ్యాన్ని అప్పగిస్తుంటామని, 17 శాతం తేమతో సన్నరకం వడ్లను కేటాయిస్తే క్వింటాకు 58-60 కిలోల బియ్యం మాత్రమే వస్తుందని మిల్లర్లు చెబుతున్నారు. ఈవిషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని కోరుతున్నారు. గతంలో కొందరు మిల్లర్లు సీఎంఆర్ అప్పగించకపోవటంతో ఈసారి బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని ప్రభుత్వం ఇటీవల సూచించింది. మిల్లింగ్ సామర్థ్యాన్ని బట్టి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కనిష్ఠంగా సుమారు రూ.35లక్షలు, గరిష్ఠంగా రూ.1.80కోట్లను మిల్లుల యజమానులు బ్యాంకు గ్యారంటీగా సమర్పించాల్సి ఉంటుంది. జిల్లాల వారీగా కేటాయించిన ధాన్యానికి సంబంధించిన బియ్యం (కస్టమ్ మిల్లింగ్ రైస్) తిరిగి అప్పగిస్తేనే ముందస్తుగా సమర్పించిన బ్యాంకు గ్యారంటీలను ఆ జిల్లాలోని మిల్లులన్నింటికీ తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ నిబంధనను జిల్లాల వారీగా కాకుండా మిల్లుల వారీగా అమలుచేయాలని మిల్లర్లు కోరుతున్నారు. మిల్లర్లు, ప్రభుత్వం మధ్య చర్చలు త్వరగా కొలిక్కిరావాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.

**అన్నదాతలకు అన్నీ కష్టాలే...**

కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన తరువాత వర్షానికి ధాన్యం తడిసినా సంబంధిత రైతులే బాధ్యత తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. మిల్లుల వద్ద దిగుమతిలో జాప్యం జరిగినా లారీలో ఉక్కపోతకు ధాన్యం తేమశాతం పెరుగుతుంది. తీరా మిల్లులకు చేరిన తరువాత మిల్లర్లు ధాన్యం పరీక్షించి తాలు ఉందంటూ.. క్వింటాకు 10కిలోల తరుగు తీస్తామంటున్నారు. తిరుగు రవాణా ఖర్చులు భరించలేక నష్టమైనా సరే అన్నదాతలు అంగీకరిస్తున్నారు. కొందరు రైతులు ఈ సమస్యలను తట్టుకోలేక ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.300-400 తక్కువకు దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. సన్నరకం ధాన్యంపై క్వింటాకు 58-60 కిలోల బియ్యం మాత్రమే ఇవ్వగలం. అంతకుమించి అప్పగించలేమని అధికారులకు విన్నవించాం. బ్యాంకు గ్యారంటీ విషయంలోనూ నిబంధనలు సడలించాలి.

- బొమ్మా రాజేశ్వరరావు, మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం

# విస్తరణ 'దారి' కొచ్చేదెన్నడు?



కరీంనగర్ : ఇరుకిరుకు రహదారులు.. అడుగడుగునా గుంతలు.. వాహనాల రద్దీ.. నిత్యం ప్రమాదాలు.. ఇదీ ఉమ్మడి జిల్లాలోని ప్రధాన మార్గాల పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా విస్తరణకు నోచుకోక, ఎన్నికల సమయంలో నాయకులకు హామీలుగా మారుతున్నాయి. జాతీయ రహదారులుగా మార్చాలన్న ప్రతిపాదనలకు ఆమోదం లభించడం లేదు. అనుమతి వచ్చినా నిధుల విడుదలలో జాప్యం, సర్వే చేపట్టినా భూ సేకరణలో ఆలస్యం పరిపాటిగా మారింది.

1. నిజామాబాద్-జగిత్యాల-ధర్మపురి-జగదల్‌పూర్

నిజామాబాద్ నుంచి చత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ వరకు నిర్మించిన 63వ నంబరు జాతీయ రహదారి మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, రాయపట్నం మీదుగా వెళ్తుంది. ఉమ్మడి జిల్లాలో 69 కి.మీ. రహదారి విస్తరణకు రూ.2,581 కోట్లతో అంచనా వేశారు. మూడు చోట్ల బైపాస్ నిర్మించాలని సర్వేలో తేల్చారు. మొదట 224 హెక్టార్లు, తరువాత 304 హెక్టార్ల భూ సేకరణకు నిర్ణయించారు. దాదాపు మూడేళ్లుగా ప్రక్రియ కొనసాగుతుండగా వర్షాలకు లో లెవల్ వంతెనలు నీట మునుగుతున్నాయి.

2. కరీంనగర్-జగిత్యాల

ఉమ్మడి జిల్లాలో అత్యంత రద్దీగా ఉండే మార్గమిది. నిత్యం 22 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా ప్రమాదం జరగని రోజంటూ ఉండదు. ఎన్‌హెచ్-536 నిర్మాణంలో భాగంగా కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో 58 కి.మీ. మేర విస్తరించాల్సి ఉంది. ఆరేళ్ల కిందటే ప్రతిపాదనలు పంపగా ఇటీవల రూ.2,227 కోట్లు విడుదలయ్యాయి. పెద్దవి 27, చిన్నవి 29 కూడళ్లు, పాతవి కొత్తవి కలిపి 24 చోట్ల వంతెనలు నిర్మించాలి. వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియ నిర్వహించనుండగా ఇప్పటికే సర్వే పూర్తయింది.

3. కరీంనగర్- రాయపట్నం

కోదాడ నుంచి కరీంనగర్ మీదుగా రాయపట్నం వరకు వెళ్లే ఈ మార్గంలో ఉమ్మడి జిల్లాలో 60 కి.మీ.లు విస్తరించాలి. జాతీయ రహదారులు ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) పదేళ్ల కిందటే సర్వే చేపట్టింది. దాదాపు ఆరేళ్ల కిందట రూ.1800 కోట్లతో అంచనా వేసినా నిధులు రాలేదు. గుంతలకు కనీస మరమ్మతు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

4. జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం

తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల అనుసంధానానికి కీలకమైన మార్గం. ఉమ్మడి జిల్లాలో 130 కి.మీ. మేర విస్తరించగా జాతీయ రహదారిగా మార్చాలని పదేళ్ల కిందట ప్రతిపాదించారు. ఈ రహదారి విస్తరణతో సరకు రవాణా వాహనాలకు దూరాభారం తగ్గుతుంది. కరీంనగర్-గోదావరిఖని మార్గంలో రాజీవ్ రహదారిపై వాహనాల రద్దీ తగ్గుతుంది.

5. కరీంనగర్-సిరిసిల్ల-కామారెడ్డి-పిట్లం

కరీంనగర్ నుంచి కామారెడ్డి మార్గంలో నాలుగు వరుసల విస్తరణ సహా జాతీయ హోదా ప్రక్రియ కొన్నేళ్లుగా అటకెక్కింది. ఆరేళ్ల కిందట కరీంనగర్ నుంచి సిరిసిల్ల వరకు రూ.199 కోట్లతో విస్తరణ పనులు చేపట్టినా ఇప్పటికీ పలు చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. జాతీయ రహదారిగా మారితే ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల మధ్య రవాణా మెరుగవుతుంది. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు జాతీయ రహదారి పనులు జరుగుతుండటంతో ఈ మార్గాన్ని విస్తరించాలన్న డిమాండ్ పెరుగుతోంది.

# జల చైతన్యం.. జన భాగస్వామ్యం



పెద్దపల్లి : వాతావరణ మార్పులు, మానవ తప్పిదాలతో ఏటికేడు భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వేసవిలో నీటి ఎద్దడితో రైతులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో పడుతున్న లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఎక్కడి నీరు అక్కడే ఇంకేలా 'జల సంచాయి, జన భగీదర'లో భాగంగా 'జల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉపాధిహామీ కూలీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో అధికారులు రంగంలోకి దిగారు.

**కార్యక్రమం తీరు**

ఉపాధి కూలీలు ప్రజలకు జల సంరక్షణపై చైతన్యం కల్పించనున్నారు. వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించేందుకు ప్రోత్సహించనున్నారు. జిల్లాల వారీగా ఎన్ని నివాస గృహాలు ఉన్నాయి? ఇంకుడు గుంతలు ఎన్ని నిర్మించారు? సమతల, కాంటూరు కందకాలు ఎన్ని ఉన్నాయో అనే వివరాలు సేకరిస్తున్నారు. ప్రజల అవసరాలను బట్టి కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదించనున్నారు. కొండలు, గుట్టల దిగువ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో కాంటూరు కందకాలు తవ్వించుకునేలా రైతులను ప్రోత్సహించనున్నారు. ఇందులో మున్సిపల్, అటవీ, ఇతర శాఖల భాగస్వామ్యం తీసుకోనున్నారు.

**కనీస బాధ్యత**

వర్షాలు కురిసినప్పుడు ఇంటి పైభాగంలోని నీటిని ఇంకుడుగుంతల ద్వారా భూగర్భంలోకి ఇంకించడం. చేతిపంపుల వద్ద సామూహిక, ఇళ్లల్లో వ్యక్తిగత ఇంకుడుగుంతలు నిర్మించడం. వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కుంటలు, కాంటూరు కందకాలు, సమతల కందకాలు తవ్వడం. అవసరమైన ప్రాంతాల్లో చిన్నపాటి కుంటలు, నీటి నిల్వ కుంటలు, చెక్‌డ్యాంలు. వ్యవసాయ మోటార్లకు ఆటోమెటిక్ స్టార్టర్లు అమర్చుకోవాలి. బోర్ల తవ్వకాలపై పర్యవేక్షణ పెంచాలి. ఇంటికొక ఇంకుడుగుంత తప్పకుండా నిర్మించాలి.

నీటి సంరక్షణపై చైతన్యం చేస్తాం నీటి సంరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తాం. ఇప్పటికే వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాం. ఇంకుడుగుంతలు లేని ఇళ్లను గుర్తించి కొత్తగా నిర్మించేందుకు ప్రోత్సహిస్తాం. ప్రజలకు నీటి సంరక్షణపై చైతన్యం కల్పిస్తాం. రవీందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# వీడని జ్వరం.. తగ్గని ఒళ్లు నొప్పులు

కరీంనగర్ : వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు, జలుబు, దగ్గు, తదితర జబ్బులు వస్తుంటాయి. జులై నెలలో వర్షాలు కురిసిన అనంతరం మొదలైన రోగాలు చలికాలం వచ్చినా ప్రజలను వీడటంలేదు. ఇప్పటికీ ప్రతిరోజు జిల్లా ఆసుపత్రిలో వెయ్యికి పైగా ఓపీ నమోదవుతోంది. చికున్‌గన్యా, డెంగీ వంటి వ్యాధులతో రావడంలేదని, కేవలం చిన్నపాటి జ్వరం దగ్గు, జలుబుతో రోగులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. రక్త పరీక్షలు అవసరంలేదని కేవలం మందులతోనే వ్యాధి తగ్గుతుందని ఆందోళన పడాల్సిన అవసరంలేదని సూచిస్తున్నారు. చిన్నపాటి వ్యాధులతో ఇక్కడి వరకు వస్తుండటంతో దీర్ఘకాలిక రోగులకు అత్యవసర వైద్యం అందడంలో ఆలస్యమవుతోంది. కాలానుగుణ వ్యాధుల నిమిత్తం ఆసుపత్రిలో వైద్యాధికారులు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. పరిమితికి మించి రోగులు వచ్చినా వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. అధిక శాతం మంది వైద్యుడికి చూపించుకొని ఇళ్లకు వెళ్తున్నారు. దీంతో ఆసుపత్రిలో మంచాలు ఖాళీగా ఉంటున్నాయి. వైరల్ జ్వరాల తర్వాత చాలామంది ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. నెల నుంచి ఆరు నెలల వరకు ఇబ్బంది పడుతున్నారు. వారికి తాత్కాలిక ఉపశమనం కోసం వైద్యు మందులు ఇచ్చి పంపిస్తున్నారు. నొప్పులు క్రమంగా తగ్గుతాయని ఆందోళన చెందానవసరంలేదని వైద్యులు చెబుతున్నారు.

**భరోసా కల్పించేలా చర్యలు అవసరం..**

చాలా మంది చిన్న జబ్బులకు ఇక్కడి వరకు రావడంతో ప్రధాన రోగులకు, ఆసుపత్రి వైద్యాధికారులకు ఇబ్బందిగా మారుతుంది. సమీప దవాఖానాల్లో సరిగా వైద్యం అందదనే భావనతోనే చాలా మంది పెద్ద దవాఖానాకు వస్తున్నారు. బస్తీ, పల్లెల్ల దవాఖానాల్లోనూ నాణ్యమైన



వైద్య సేవలందుతాయని ఉన్నతాధికారులు భరోసా కల్పించాల్సిన అవసరముంది. అలా చేస్తే అత్యవసర రోగులకు ఇక్కడ సేవలు ఆలస్యంగా కాకుండా ఉంటాయి. అందరూ వచ్చి ఓపీ లైనులో ఉండటంతో అత్యవసరమైన వారికి చికిత్స అందడంలో ఆలస్యమయ్యే అవకాశముంది.

**మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం**

ఆసుపత్రిలో ఓపీ రద్దీ అధికంగానే ఉంటుంది. చాలామంది జ్వరం, దగ్గు, జలుబుతో వస్తున్నారు. వారికి మందులతో తగ్గిపోతుంది. వైద్యసిబ్బంది అందరూ విధి నిర్వహణలో ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. డాక్టర్ వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# ఇసుక పోసే కొద్దీ అక్రమాలు

కొత్తగూడెం: ఇసుక అక్రమ రవాణాకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్డాగా మారుతోంది. ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ క్వారీల్లో అడ్డదారిలో దందా సాగిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అడపాదడపా అధికారులకు చిక్కుతున్నప్పటికీ వ్యూహాలు మార్చి దందా సాగిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. తెలంగాణ రాష్ట్ర ఖనాజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్వారీల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతుందనటానికి ఇటీవల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మైనింగ్ అధికారులు నమోదుచేసిన కేసులే నిదర్శనం. **55 కేసులు.. రూ.14లక్షల జరిమానా**

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మైనింగ్‌శాఖ అధికారులు ఇసుక అక్రమ రవాణా వాహనాలపై 55 కేసులు నమోదుచేశారు. వీటికి రూ.14,62,800 జరిమానా విధించినట్లు మైనింగ్ ఏడీ దినేష్‌కుమార్ వెల్లడించారు. గోదావరి పరీవాహక మండలాలు పినపాక, చర్లలోని ఇసుక రీచుల్లో క్వారీ నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిమితికి మించి ఇసుక లోడ్ చేస్తున్నారని, ఒక్కో బకెట్ ఇసుకకు రూ.2వేలు కాజేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇందుకు కొంతమంది టీజీఎండీసీ అధికారుల సహకారముందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా అక్రమ రవాణాను కట్టడి చేయాల్సిన తనిఖీ కేంద్రాల్లోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

**2022-23లో రూ.35కోట్ల ఆదాయానికి గండి**

ఏటా ప్రభుత్వానికి రూ.వందల కోట్ల ఆదాయం సమకూరుతుందని టీజీఎండీసీ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే ఇసుక రవాణాలో అక్రమ దందాను అరికడితే సర్కారుకు మరింత రాబడి సమకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. భద్రాద్రి జిల్లాలోని ఇసుక రీచ్‌ల ద్వారా 2022-23లో సర్కారుకు రూ.1,36,29,95,400 రాబడి వచ్చింది. సుమారు 25శాతం ఇసుక అక్రమ రవాణా జరిగినట్లు సమాచారం. దీన్నిబట్టి సర్కారు దాదాపు రూ.35 కోట్ల ఆదాయం కోల్పోయినట్టే. పరిమితికి మించి లారీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.

**క్వారీలొస్తేనే.. కట్టడి**

జిల్లాలో ప్రస్తుతం పినపాక, చర్ల మండలాల్లోని రీచ్‌ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. గతంలో మొత్తం పది రీచ్‌ల ద్వారా 7,95,285 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు అనుమతులివ్వటానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక విధానంలో లోపాలున్నాయని.. వాటిని సవరించటానికి నూతన విధానం తెస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. రీచ్‌లకు అనుమతుల ప్రక్రియ ఆదిలోనే ఆగిపోయింది. ప్రభుత్వం ఇసుక రీచ్‌లను కేటాయించాలని గిరిజన సొసైటీలు దరఖాస్తు చేసుకున్నా మోక్షం లభించటం లేదు. రీచ్‌లను మంజూరు చేస్తే ఇసుక లభ్యత పెరిగి అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇసుక రీచ్‌ల్లో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశాం. ఇసుక అక్రమ రవాణాకు అవకాశం లేకుండా చూస్తున్నాం. సిబ్బందితో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశాం. అనుమానం వచ్చిన వాహనాలను స్వాధీనపరచుకొని వివరాలు సేకరిస్తున్నాం.

- శంకర్‌నాయక్, టీజీఎండీసీ పీఓ, భద్రాద్రి కొత్తగూడెం

# అనుసంధానం మరింత ఆలస్యం..!

ఖమ్మం : సీతారామ ప్రాజెక్టు నుంచి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాల మళ్లింపులో కీలకమైన పాలేరు అనుసంధాన కాల్వ తవ్వకానికి సంబంధించిన 13వ ప్యాకేజీ టెండర్ గడువును ఈనెల 16 వరకు అధికారులు పొడిగించారు. ఖమ్మంలోని నీటిపారుదలశాఖ ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజినీర్) కార్యాలయం నుంచి టెండర్లు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు నీటిపారుదలశాఖ అధికారులు టెండర్ గడువు పొడిగించినట్లు తెలిసింది. సుమారు ఎనిమిదేళ్ల తర్వాత గతనెల 25న 13వ ప్యాకేజీ పనులకు రూ.191 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు ఆహ్వానించారు. ఆన్‌లైన్‌లో గుత్తేదారులు టెండర్లు దాఖలు చేసేందుకు ఈనెల 8వ తేదీని గడువుగా



నిర్ణయించారు. తాజాగా 16 తేదీ వరకు గడువు పొడిగించటం గమనార్హం. చివరి రోజు సాయంత్రం 5 గంటల తర్వాత ఖమ్మంలోని ఎస్ఈ కార్యాలయంలో టెండర్లు తెరవాల్సి ఉంటుంది.

**చీమలపాడు నుంచి బురదరాఘవాపురం వరకు..**

పాలేరు అనుసంధాన కాల్వ ఆరంభంలో 10.50 కి.మీ. పొడవున తవ్వకం పనులు 13వ ప్యాకేజీలో ఉన్నాయి. 14, 15, 16 ప్యాకేజీ పనులను రెండేళ్ల క్రితమే చేపట్టారు. కాల్వ తవ్వకానికి 345 ఎకరాలను సేకరించాల్సి ఉంది. ఇందులో 225 ఎకరాలు రిజర్వ్ ఫారెస్టు భూములు. వీటికి దిల్లీ స్థాయిలో అనుమతులు రావాల్సి ఉంది. చీమలపాడు, బాజుమల్లాయిగూడెం గ్రామాలకు చెందిన పలువురు రైతుల నుంచి 120 ఎకరాల పట్టా భూములు సేకరించాలి. ఇందుకు రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. సింగరేణి మండలం చీమలపాడు నుంచి ఏన్కూరు మండలం బురదరాఘవాపురం వరకు కాల్వ తవ్వాలి.

**గుత్తేదారుల లాబీయింగ్**

పాలేరు అనుసంధాన కాల్వ 13వ ప్యాకేజీ పనులు దక్కించుకునేందుకు పలువురు గుత్తేదారులు ఉన్నతస్థాయిలో లాబీయింగ్ జరుపుతున్నట్లు తెలిసింది. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆశీస్సుల కోసం ఖమ్మంకు చెందిన బడా గుత్తేదారు రాజధానిలోనే మకాం వేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల్లో గతంలో తనకు అన్యాయం జరిగిందని, ఒక్క ప్యాకేజీ అయినా రాలేదని, ఈసారి ఎలాగైనా తనకు ఇప్పించాలని కోరుతున్నట్లు తెలిసింది. పనుల కోసం పోటీపడుతున్న పలువురు గుత్తేదారులు తమకు మంత్రుల హామీ లభించినట్లు ప్రచారం సాగిస్తున్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల అనుయాయులు తమకు సంబంధించిన కంపెనీలకు 13వ ప్యాకేజీ పనులు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు పెద్దలతో సన్నిహిత సంబంధాలు కలిగిన కడప జిల్లాకు చెందిన బడా కాంట్రాక్టర్ సైతం ఈ పనులపై కన్నేసినట్లు సమాచారం.

**ఖమ్మం ఎస్ఈ పోస్టు ఖాళీ..**

నీటిపారుదలశాఖలో వివిధ టెండర్లు ఆహ్వానించాల్సిన ఖమ్మం సర్కిల్ ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉంది. అక్టోబర్ 31న నర్సింగరావు ఉద్యోగ విరమణ పొందగా కొత్తగా ఎవరినీ నియమించలేదు. ఇన్‌ఛార్జి బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు. కీలక సమయంలో ఎస్ఈ పోస్టు గాలిలో దీపంలా మారటంతో సర్కిల్‌లోని అధికారులు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.



## అంబేద్కర్‌ను సంపూర్ణంగా గౌరవిస్తోంది మేమే.. ప్రతిపక్షాల విమర్శలపై మోదీ కౌంటర్

ఢిల్లీ: కేంద్ర హోం మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను అవమానించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు షెడ్యూల్ కులాలు, తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'కొన్నేళ్ల పాటు కాంగ్రెస్ సాగించిన అరాచకాలు, ముఖ్యంగా అంబేద్కర్‌ను అవమానించిన తీరును ఇప్పుడు చెప్పే అబద్ధాలతో వారు దాచలేరు. అలా అనుకుంటే వారు పెద్ద పొరబాటు చేసినట్లే. ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ చేసిన ప్రయత్నాలను దేశ ప్రజలంతా చూశారు. మనం ఇలా ఉండటానికి అంబేద్కరే కారణం. గత దశాబ్దకాలంగా ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు మా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసింది. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి ప్రధాన కార్యక్రమాలు ప్రతిఒక్కరికీ ఉపయోగపడ్డాయి. అంబేద్కర్‌తో అనుబంధం ఉన్న ఐదు ప్రసిద్ధ ప్రదేశాలైన పంచతీర్థాన్ని అభివృద్ధి చేసేందుకు మా ప్రభుత్వమే కృషి చేసింది. దశాబ్దాలుగా చైత్య భూమికి సంబంధించిన పెండింగ్ లో ఉన్న భూ సమస్యను మా ప్రభుత్వమే పరిష్కరించింది. నేను అక్కడ ప్రార్థనకు వెళ్లాను. అంబేద్కర్ తన చివరి ఏళ్లలో గడిపిన ఢిల్లీలోని 26 అలీపూర్ రోడ్డును మేము అభివృద్ధి చేశాం. లండన్ లో ఆయన నివసించిన ఇంటిని మా ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఆయన్ను సంపూర్ణంగా గౌరవిస్తుంది మేమే. పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా మాట్లాడి కాంగ్రెస్ చీకటి చరిత్రను బయటపెట్టారు. ఆయన మాట్లాడిన వాస్తవాలను చూసి వారు సైతం ఉలిక్కిపడటంతో పాటు ఆశ్చర్యపోయారు. అందుకే ఇప్పుడు వారు నాటకాలాడుతున్నారు. కానీ, ప్రజలకు నిజం తెలుసు' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటులో షా మాట్లాడిన వీడియోను ఆయన పంచుకున్నారు. రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా అంబేద్కర్ ను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. షా దళితులను అవమానించారంటూ కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆరోపించాయి. బుధవారం పార్లమెంటు ఆవరణలో అంబేద్కర్ ఫోటో పట్టుకొని నిరసన తెలిపారు. ఆయన హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.




విజయవాడ: జల్‌జీవన్ మిషన్‌లో గత ప్రభుత్వం రూ. 4వేల కోట్లు దుర్వినియోగం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విమర్శించారు. నీటిని ఎక్కడి నుంచి తెచ్చుకుంటామనేది గుర్తించక ముందే పైపులు వేశారన్నారు. విజయవాడలో జల్‌జీవన్ మిషన్ అమలుపై గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 70వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు పవన్ తెలిపారు. ఈ మేరకు కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను కోరామన్నారు. పూర్తి వివరాలతో రావాలని ఆయన సూచించినట్లు వివరించారు. "జనవరి నెలాఖరుకు డీపీఆర్ తీసుకొని జల్‌శక్తి మంత్రికి ప్రతిపాదన పంపిస్తాం. జల్‌జీవన్ మిషన్‌ను మరింత బలోపేతం చేస్తాం. అనేకమంది అనుభవిస్తున్న నీటి సమస్య పరిష్కారాన్ని తొలి ప్రాధాన్యంగా తీసుకోవాలి. రోజుకు మనిషికి సగటున 55 లీటర్ల పరిశుభ్రమైన నీటిని ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల. నిరంతరం ప్రతిఒక్కరికీ నీటి సరఫరా ఉండాలనే ఆకాంక్షతో జల్‌జీవన్ మిషన్ ప్రారంభమైంది" అని పవన్ అన్నారు.

## చెత్త పేరుకుపోకుండా చైనా తరహాలో విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు: నారాయణ



రాజమహేంద్రవరం: చెత్త పేరుకుపోకుండా చైనా తరహాలో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. మూడేళ్లలో రాజధాని అమరావతి పనులను పూర్తి చేస్తామన్నారు. పుష్కరాలు, రాజమహేంద్రవరం అభివృద్ధిపై సీఎం చంద్రబాబుతో సమీక్షిస్తామని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం పన్నులు పెంచిందని.. ప్రభుత్వ నిధులను దారి మళ్లించిందని మంత్రి నారాయణ విమర్శించారు.

## అదానీపై జేపీసీతో విచారణ జరిపించండి: వైఎస్ షర్మిల



విజయవాడ, డిసెంబర్ 18: ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ వ్యవహారంపై వెంటనే జేపీసీ ఏర్పాటు చేసి విచారణ జరపాలని మోదీ ప్రభుత్వాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలాగే గౌతమ్ అదానీ వద్ద వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ముడుపులు తీసుకున్న వ్యవహారంలో ఏసీబీ రంగంలోకి దింపి విచారణ చేపట్టేలా ఆదేశించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో గౌతమ్ అదానీపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐసీసీ పిలుపు మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్ యాత్ర చేపట్టారు. అయితే ఈ యాత్రను నగర పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల చర్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. అదానీ, వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మధ్య ముడుపుల వ్యవహారంపై నిజానిజాలు నిగ్గు తేల్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. స్వయంగా ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌కి అదానీ గ్రూప్ రూ. 1,750 కోట్లు లంచం ఇచ్చారని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ నివేదిక ఇస్తే.. కేంద్రంలో మోడీ కానీ.. రాష్ట్రంలో చంద్రబాబు కనీసం నోరు విప్పడం లేదంటూ వైఎస్ షర్మిల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ సైతం జరిపించడం లేదన్నారు.

**పరువు తీసిన ఇద్దరు..** అదానీ మీద ఈగ కూడా వాలనివ్వడం లేదని కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ప్రపంచం ముంగిట దేశం పరువు, ఖ్యాతిని అదానీ తీస్తే.. ఆయన వద్ద లంచాలు తీసుకొని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరువు తీశారని మండిపడ్డారు. స్వలాభం కోసం విద్యుత్‌ను అధిక ధరకు కొనుగోలు చేసి.. జనం నెత్తిన రూ. 1.50 లక్షల కోట్ల భారం వేశారని ఆరోపించారు. ఇదో పెద్ద కుంభకోణమంటూ గతంలో తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆరోపణలు చేసిందని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ప్రధాని మోదీకి, అదానీకి భయపడి టీడీపీ మౌనం పాటిస్తోందన్నారు.

**పిలుపునిచ్చిన ఏఐసీసీ..** లంచం ఆరోపణలు వెల్లువెత్తినా.. గౌతమ్ అదానీ వ్యవహారంలో కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అందుకు నిరసనగా ఛలో రాజ్‌భవన్ కార్యక్రమం చేపట్టాలని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఏఐసీసీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో జరిగిన ఛలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఇక పక్క రాష్ట్రం తెలంగాణలో సైతం ఛలో రాజ్ భవన్ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ సహచరులు సైతం హాజరయ్యారు.

## కాకినాడలోని బంగారం దుకాణంలో తుపాకీతో బెదిరించి ఆభరణాల చోరీ





కాకినాడ: జిల్లా కేంద్రమైన కాకినాడలో పట్టపగలు ఓ దొంగ హల్‌చల్ చేశాడు. నగరంలోని ఓ బంగారం షోరూమ్‌లోకి చొరబడిన దొంగ తుపాకీతో ఉద్యోగిని బెదిరించి ఆభరణాలు దోచుకెళ్లాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించి అటవీశాఖ కార్యాలయం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దొంగ వద్ద నుంచి తుపాకీతో పాటు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న తుపాకీ డమ్మీదని పోలీసులు తేల్చారు. దొంగను కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.






## ఏపీలో జికా వైరస్ కలకలం - బిగ్ అలర్ట్..!!

నెల్లూరు : ఏపీలో జికా వైస్ కలకలం సృష్టిస్తోంది. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలుడికి జికా వైరస్ లక్షణాలు కనిపించాయి. దీంతో, స్థానికులు ఆందోళ నకు గురయ్యారు. వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. బాలుడి రక్త నమూనాలను పూణే ల్యాబ్ కు పంపారు. బాలుడికి చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. స్పందించిన ప్రభుత్వం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటించింది. బాలుడు గ్రామంలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కరోనా తరువాత అందరినీ భయపెట్టిన జికా వైరస్ మరోసారి కనిపించింది. జికా వైరస్ లక్షణాలతో ఆరేళ్ల బాలుడుని గుర్తించారు. వెంటనే స్థానిక యంత్రాంగం అప్రమత్తమై చర్యలు తీసుకుంది. బాలుడి రక్త పరీక్షలు సేకరించింది. ఆ గ్రామంలో ఇంకా ఎవరైనా అనారోగ్యానికి గురయ్యారా అని ఆరా తీస్తోంది. ఎవరూ ఎటువంటి అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని చెబుతోంది. ఇదే సమయంలో జిల్లా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించారు. బాలుడికి జికా వైరస్ సోకిందని నిర్ధరణ కాలేదని చెప్పారు. బాలుడికి కార్పొరేట్ వైద్యం అందించేందుకు చెన్నైకు తరలించామని వెల్లడించారు. వ్యాధి సోకిన బాలుడికి మెరుగైన చికిత్స అందిస్తామని మంత్రి ఆనం ప్రకటించారు. అదే విధంగా బాలుడి కి జికా వైరస్ సోకిందనే అనుమానంతో గ్రామస్తులందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి మెరుగ్గానే ఉందని..ఆందోళన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గ్రామంలో మొత్తం 150 గృహాలు ఉండగా ప్రతి కుటుంబానికీ వైరస్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జ్వరాలు సోకిన వారికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎవరూ పుకార్ లను నమ్మవద్దని సూచించిన మంత్రి ఆనం..అదే సమయంలో ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని గ్రామస్థులను కోరారు.

## నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం.. స్పందించిన మంత్రి ఆనం



నెల్లూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలుడికి జికా వైరస్ సోకినట్లు ప్రచారం జరిగింది.

మంత్రి ఆదేశాలతో జికా వైరస్ అనుమానాలపై జిల్లా యంత్రాంగం స్పందించింది. "అనారోగ్యానికి గురైన బాలుడికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. కార్పొరేట్ వైద్యం కోసం చెన్నై తరలించాం. వ్యాధి నిర్ధరణ కోసం బాలుడి బ్లడ్ శాంపిల్స్‌ను అధికారులు పుణే ల్యాబ్‌కు పంపించారు. జీజీహెచ్ వైద్యులతో పాటు వెంకటాపురం గ్రామానికి ప్రత్యేక వైద్య బృందాలు వెళ్లాయి. బాలుడి కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్థులకు వైద్యపరీక్షలు చేస్తున్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు" అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

## సీనియర్ సిటిజన్లకు అన్ని ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం: కేజ్రీవాల్ హామీ



ఢిల్లీ: వచ్చే ఏడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆప్ కీలక హామీ ప్రకటించింది. ఢిల్లీలోని సీనియర్ సిటిజన్లు అందరికి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చింది. మరోసారి ఆప్ అధికారంలోకి వస్తే 60 ఏళ్లు దాటిన వృద్ధులందరికీ ఉచిత వైద్యం అందించేలా 'సంజీవని యోజన' అమలు చేస్తామని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. 'వయో వృద్ధుల సంరక్షణ మా బాధ్యత. మీరెంతో కష్టపడి పనిచేసి దేశాన్ని ముందుకు తీసుకొచ్చారు' అన్నారు. సీనియర్ సిటిజన్లు అనారోగ్యానికి గురైతే వారి చికిత్సకు అయ్యే ఖర్చుకు గరిష్ఠ పరిమితి ఏమీ ఉండదని కేజ్రీవాల్ తెలిపారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందని.. ఆప్ కార్యకర్తలే ఇళ్లకు వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. వారు ఇచ్చే కార్డును జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో తాము అధికారంలోకి రాగానే.. ఈ ఉచిత చికిత్స విధానాన్ని అమలు చేస్తామన్నారు. మరోవైపు, ఢిల్లీ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ వారంలోనే సమావేశం నిర్వహించనుంది. ఈ క్రమంలో త్వరలోనే ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆప్ 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆప్ చీఫ్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ నుంచి పోటీ చేయనున్నారు.. సీఎం ఆతిశీ కల్కాజీ సీటు నుంచి బరిలో నిలవనున్నారు.

## పార్లమెంట్ ప్రాంగణంలో మోదీ, అమిత్ షాతో రాహుల్ భేటీ



ఢిల్లీ: పార్లమెంట్ ప్రాంగణంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బుధవారం ప్రధానమంత్రి కార్యాలయంలో పీఎం మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా , కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. జాతీయ మానవహక్కుల కమిషన్ నియామకం విషయమై ఈ భేటీ జరిగింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్‌ను ఎంపిక చేసే కమిటీలో పీఎం, కేంద్ర హోంమంత్రి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్, ఉభయ సభల్లో ప్రతిపక్ష నేతలు సభ్యులుగా ఉంటారు. అయితే ప్రస్తుతానికి మోదీ, అమిత్‌షా, ఖర్గే, రాహుల్ మధ్యే సమావేశం జరిగింది. ఇదిలాఉంటే.. నిన్న రాజ్యసభలో చర్చ నేపథ్యంలో అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతోన్న సంగతి తెలిసిందే. హోంమంత్రి వ్యాఖ్యలను విపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అంబేద్కర్ చిత్రాలు ప్రదర్శిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో ఎంపీలు నిరసన తెలిపారు. అలాగే అమిత్ షా రాజీనామాను డిమాండ్ చేశాయి. ఆ నిరసనల్లో రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ తరుణంలో తాజాగా వీరి భేటీ జరిగింది.

## ఏపీలో పెట్టుబడులదారుల కోసం కొత్త విధానం



అమరావతి, డిసెంబర్ 18: వచ్చిన పెట్టుబడుల ఫలాలు సకాలంలో అందేలా ఏపీలో వినూత్న విధానం అమలులోకి తీసుకురానున్నట్లు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌తో నిరంతర పర్యవేక్షణ, సకాలంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఎస్ఐపీసీ ప్రాజెక్టు మానిటరింగ్ మెకానిజమ్‌పై పెట్టుబడుల ప్రతిపాదనల పర్యవేక్షణ చర్యలపై బుధవారం సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని శాఖలకు జిల్లా స్థాయిలో పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నోడల్ అధికారిగా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. యూనిట్లు ఏర్పాటుకు పెట్టుబడుల ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహం, ఎగుమతుల కమిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పరిశ్రమ ఏర్పాటులో డీపీఆర్ స్థాయి నుంచి యూనిట్ గ్రౌండింగ్ అయ్యే వరకూ ట్రాకర్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. దీని కోసం ఎస్ఐపీసీ ప్రాజెక్టు మానిటరింగ్ మెకానిజమ్ కింద ఇకపై ప్రత్యేక ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ తీసుకొస్తామన్నారు. ఒక సమర్థవంతమైన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రాష్ట్రంలో ఏర్పాటవుతున్న ప్రాజెక్టులను ట్రాక్ చేయడమే ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.

## కానిస్టేబుళ్ల భర్తీ.. హోంగార్డులకు హైకోర్టులో ఊరట

అమరావతి: హోంగార్డులకు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. కానిస్టేబుళ్ల భర్తీలో హోంగార్డులను ప్రత్యేక కేటగిరీగా పరిగణించాలని హైకోర్టు తెలిపింది. ఈమేరకు స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆరు వారాల్లో ప్రత్యేక మెరిట్ జాబితా తయారీ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.



## పల్చటి చీర కట్టులో అందాల క్లీవేజ్ షో

టాలీవుడ్‌లో వరుణ్ తేజ్‌తో కలిసి నటించిన 'కంచె' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించిన ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్. తక్కువ సమయంలోనే మంచి పాపులారిటీని సొంతం చేసుకున్నా అదృష్టం కలిసి రాకపోవడంతో యంగ్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కలేదు. బాలకృష్ణ వంటి బడా హీరోతో సినిమా చేసినా అది ఆమె కెరీర్‌ను మలుపు తిప్పలేక పోయింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు అవుతున్నా ఈ అమ్మడు ఇంకా ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటోలు, వీడియోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతున్నాయి. కంచె సినిమా తర్వాత ఈ అమ్మడు చేసిన సినిమాల్లో కొన్ని కమర్షియల్‌గా హిట్ అయినా కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. అయినా తన అందం వల్ల ఆఫర్లను సొంతం చేసుకుంటూ ఉంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు అయినా అదే అందంతో ముద్దుగుమ్మ ప్రగ్యా ముద్దుగా కనిపిస్తుంది అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈమె అందం కారణంగానే ఇప్పటికీ ఆఫర్లు వస్తున్నాయని, లక్ కలిసి వస్తే ముందు ముందు అయినా స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ దక్కించుకుంటుంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందం ఉన్నా కాస్త ఎత్తు ఎక్కువ ఉండటం వల్ల కొందరు హీరోలు ఈమెను దూరం పెడుతున్నారు అనేది కొందరి అభిప్రాయం. ఏది ఏమైనా ఇంతటి అందాలకు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు, రావాల్సిన ఆఫర్లు రావడం



లేదు అనేది అభిమానుల అభిప్రాయం. సోషల్ మీడియాలో తాజాగా మరోసారి ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసింది. అందాల ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్ మరోసారి క్లీ వేజ్ షోతో ఫోటోలను షేర్ చేసింది. పల్చటి చీర కట్టులో క్లీ వేజ్ షో తో కవ్విస్తున్న ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్ ఫోటోలో సోషల్ మీడియాలో మరో సారి వైరల్ అవుతున్నాయి. ప్రగ్యా జైస్వాల్ గతంలో పలు అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసింది, చీర కట్టు ఫోటోలతో కన్నుల విందు చేసింది. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లుగా అందాల ఆరబోత చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. పల్చటి చీర కట్టులో భలే ఉంది అంటూ ప్రతి ఒక్కరితోనూ ప్రశంసలు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు బాలకృష్ణతో చేస్తున్న డాకు మహారాజ్ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరోసారి బాలయ్యతో కలిసి ప్రగ్యా విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే నమ్మకంను ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు.

## తాప్సీ పెళ్లి.. ఎంత పెద్ద సీక్రెట్ దాచింది!

తాప్సీ పన్ను ఇటీవల తన చిరకాల ప్రియుడు, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మథియాస్ బోను పెళ్లాడిన సంగతి తెలిసిందే. 2024 మార్చిలో ఉదయ్‌పూర్‌లో ఈ జంట వివాహం జరిగింది. అయితే ఇది అసలు పెళ్లి కాదు.. తనకు 2023లో జరిగినదే అసలు పెళ్లి అని చెబుతోంది తాప్సీ. డిసెంబర్ 2023లో కోర్టు వివాహం(రిజిస్టర్డ్ పెళ్లి) చేసుకున్నట్లు తాప్సీ వెల్లడించింది. తనకు 2023లోనే పెళ్లయిన విషయం ప్రజలకు ఎందుకు తెలియదో కూడా వెల్లడించింది. నిజానికి గత ఏడాది డిసెంబర్‌లో వివాహం చేసుకున్నాము. మేము అప్పుడు పేపర్‌లపై సంతకం చేసాం. నేను ఈ రోజు ప్రస్తావించకపోతే, ఎవరికీ తెలియదని కూడా తాప్సీ తాజా చాటింగ్ సెషన్ లో అన్నారు. 2023లో పెళ్లి చేసుకునే సమయానికి తాను కెరీర్ పరంగా బిజీగా ఉన్నానని .. ఆ పెళ్లి కోసం కేవలం ఒక రోజు మాత్రమే సమయాన్ని కేటాయించానని




కూడా తాప్సీ వెల్లడించింది. కానీ పెళ్లి తర్వాత తన పనిలోకి తిరిగి వెళ్లిపోయానని దానివల్ల ప్రజలకు ఆ సంగతి తెలిసే అవకాశం లేదని కూడా అంది. వ్యక్తిగత విషయాలు బయటకు తెలియకూడదని తాను అనుకుంటానని తాప్సీ అన్నారు. వ్యక్తిగత విషయాలతో ముడిపడి వృత్తిపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని వెల్లడించింది. రెండు వైపులా నష్టపోకూడదనే కొన్ని చెప్పను అని కూడా తాప్సీ అంది. రెండిటినీ సమతుల్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపింది. కెరీర్ లో అనవసరమైన ఒత్తిడి వద్దని తాము భావించినట్టు కూడా వెల్లడించింది. ఎట్టకేలకు 2024లో కాదు.. 2023లోనే తాప్సీ పెళ్లి చేసుకుందని ఇప్పుడు పూర్తిగా క్లారిటీ వచ్చింది. అయితే అప్పట్లో తాప్సీ సీక్రెట్ మ్యారేజ్ అంటూ మీడియా కూడా కొన్ని కథనాలు వేసింది. కానీ అవన్నీ గాసిప్స్ మాత్రమేనని ప్రచారమైంది. కానీ ఇప్పుడు ఆ వార్తలే నిజమని ప్రూవ్ అయింది. తాప్సీ పన్ను- మథియాస్ బో మార్చి 23న ఉదయపూర్‌లో వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లికి కేవలం కొద్దిమంది సన్నిహితులు, కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. హాజరైన కొద్దిమంది ప్రముఖులలో అనురాగ్ కశ్యప్, పావైల్ గులాటి, రచయిత కనికా ధిల్లాన్ తదితరులు ఉన్నారు. తాప్సీ పన్ను చివరిగా ఫిర్ ఆయీ హసీన్ దిల్రుబాలో కనిపించింది. సన్నీ కౌశల్ , విక్రాంత్ మాస్సేతో కలిసి నటించింది.




## 'రాబిన్ హుడ్' తమ్ముడు.. రెండు నెలల గ్యాప్ లోనే..





యంగ్ హీరో నితిన్ చేతిలో ప్రస్తుతం రెండు సినిమాలు ఉన్నాయి. ఈ రెండు రిలీజ్ కి సిద్ధమవుతున్నాయి. వెంకి కుడుముల దర్శకత్వంలో 'రాబిన్ హుడ్ మూవీ' చేస్తున్నాడు. ఈ మూవీ కమర్షియల్ కామెడీ ఎంటర్టైనర్ గా ఉండబోతోంది. డిసెంబర్ 20న ఈ సినిమా రిలీజ్ అవుతుందని డేట్ ఎనౌన్స్ చేశారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఇంకా కంప్లీట్ కాకపోవడంతో రిలీజ్ వాయిదా వేశారు. ఈ చిత్రంలో శ్రీలీల నితిన్ కి జోడీగా నటిస్తోంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోన్న ఈ సినిమాని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. కచ్చితంగా ఈ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంటాననే నమ్మకంతో నితిన్ ఉన్నారు. 'భీష్మ' తర్వాత నితిన్, వెంకి కుడుముల కాంబినేషన్ లో ఈ సినిమా రాబోతోంది. దీంతో పాటు దిల్ రాజు ప్రొడక్షన్ లో వేణుశ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' అనే సినిమా కూడా నితిన్ చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఈ చిత్రంలో ఒకప్పటి స్టార్ హీరోయిన్ లయ నితిన్ అక్కగా నటిస్తోంది. ఓ విధంగా ఈ సినిమాతో ఆమె సెకండ్ ఇన్నింగ్ స్టార్ట్ చేస్తుందని చెప్పొచ్చు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ సినిమా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని మేలో రిలీజ్ చేయడానికి దిల్ రాజు ప్లాన్ చేస్తున్నారంట. నిజానికి 'రాబిన్ హుడ్' లేదంటే 'తమ్ముడు' సినిమాలలో ఏదో ఒకటి జనవరిలో రిలీజ్ అవుతుందని అనుకున్నారు. రాబిన్ హుడ్ సంక్రాంతికి దాదాపు ఫిక్స్ అయినట్లు టాక్ వచ్చింది. అయితే సంక్రాంతి రేసులో 'గేమ్ చేంజర్', 'డాకు మహారాజ్', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు ఉన్నాయి. ఈ మూడింటిపైన ఎక్స్ పెక్టేషన్స్ గట్టిగానే ఉన్నాయి. వీటితో పోటీపడటం కష్టం అని నితిన్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. సంక్రాంతి రేసులో రిలీజ్ అవుతున్న మూడు సినిమాలలో రెండు దిల్ రాజు ప్రొడక్షన్ నుంచి వస్తున్నాయి. ఇక 'తమ్ముడు' సినిమాను కూడా కాస్త గ్యాప్ ఇచ్చి రిలీజ్ చేయాలని దిల్ రాజు ఫిక్స్ అయ్యారు. రాబిన్ హుడ్ 2025 శివరాత్రిలో వచ్చే అవకాశం ఉంది.

ఇక తమ్ముడు రెండు నెలల గ్యాప్ తరువాత మే ఆఖరికి రావచ్చుని టాక్. 'భీష్మ' తర్వాత నితిన్ కి ఇప్పటి వరకు ఒక్క సక్సెస్ లేదు. అయితే నెక్స్ట్ రాబోయే రెండు సినిమాలు కెరియర్ పరంగా తనకి ప్లస్ అవుతాయని నితిన్ అనుకుంటున్నాడు. ముఖ్యంగా 'రాబిన్ హుడ్' సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకున్నాడు. రాబోయే రెండు సినిమాలు హిట్ అయితే నితిన్ కి మరల మార్కెట్ పెరిగే అవకాశం ఉందని అనుకుంటున్నారు.

## అనుష్క ఘాటి.. ఫైనల్ గా వచ్చే డేట్ చెప్పేసారు




స్టార్ హీరోయిన్ అనుష్క.. చిన్న గ్యాప్ తర్వాత ఘాటి మూవీతో అలరించేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. పవర్ ఫుల్ రోల్ లో ఆమె నటిస్తున్న ఘాటి.. పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కుతోంది. సర్వైకల్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఆ మూవీకి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఘాటి మూవీపై ఆడియన్స్ లో వేరే అంచనాలు ఉన్నాయి. రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన వీడియో గ్లింప్స్ తో అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. అనుష్క రోల్ మాస్ షేడ్స్ తో ఉండబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అందరికీ క్లారిటీ వచ్చేసింది. సరికొత్త స్టోరీతో మూవీ ఉండబోతున్నట్లు అర్థమైపోయింది. దీంతో సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందోనని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా.. మేకర్స్ తాజాగా క్రేజీ అప్డేట్ ఇచ్చారు. మూవీ రిలీజ్ డేట్ ను ప్రకటించారు. వచ్చే ఏడాది వేసవి కానుకగా ఏప్రిల్ 18వ తేదీన ఘాటిని రిలీజ్ చేయబోతున్నట్లు ఆదివారం తెలిపారు. ఓ స్పెషల్ పోస్టర్ తో పాటు వీడియోను షేర్ చేశారు. పోస్టర్ లో నెత్తుటి మరకలతో అనుష్క కనిపిస్తూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నారు. చేతిలో తుపాకీతో కొండపై భీకరమైన లుక్ లో ఉన్నారు. వీడియోలో డైరెక్టర్ క్రిష్ తోపాటు టీమ్ అంతా మూవీ వర్క్ ఎంతవరకు వచ్చిందోనని డిస్కస్ చేసుకుంటూ ఉంటారు. ఇంతలో అనుష్క వచ్చి.. క్యూట్ క్యూట్ గా రిలీజ్ డేట్ ను రివీల్ చేస్తారు. అయితే సరైన విడుదల తేదీని ఘాటి మేకర్స్ సెలెక్ట్ చేసుకున్నారనే చెప్పాలి. అప్పుడే అందరికీ హాలీడేస్ స్టార్ట్ అవుతాయి. మౌత్ టాక్ పాజిటివ్ గా ఉంటే సినిమాకు తిరుగుండదు. మేకర్స్ కూడా అంతే రీతిలో ప్రమోట్ చేయాలి. ఇక సినిమా విషయానికొస్తే.. మనోజ్ రెడ్డి కటసాని సినిమాటోగ్రాఫర్ గా, నాగవెల్లి విద్యా సాగర్ మ్యూజిక్ డైరెక్టర్ గా, తోట తరణి ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు. చాణక్య రెడ్డి తూరుపు, వెంకట్ ఎన్ స్వామి ఎడిటర్లుగా పనిచేస్తుండగా, సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్నారు. మరి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఘాటి మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## శారీ లుక్: ఏ మాయ చేసావే సంయుక్తా..!


సంయుక్త మీనన్ ఫ్యాషన్ ప్రపంచంలో వేవ్స్ క్రియేట్ చేస్తోంది. సాంప్రదాయక వస్త్రధారణ అయినా, నేటి జెన్ జెడ్ తరహాలో అల్ట్రా మోడ్రన్ లుక్ అయినా సంయుక్త అందచందాలు ఒక కవ్వింపు. నటిగా, స్టైల్ ఐకాన్‌గా తన బహుముఖ ప్రజ్ఞతో ఆకట్టుకుంటోంది. ఈ మలయాళీ బ్యూటీ ఇప్పటికే తెలుగు చిత్రసీమలో చెరగని ముద్ర వేసింది. విలక్షణ కళాకారిణిగా తనదైన నటప్రదర్శనతో భారీ ఫాలోయింగ్ ని సంపాదించుకుంది. మరోవైపు సోషల్ మీడియాల్లో ఫోటోషూట్లతోను అభిమానులకు చేరువవుతోంది. తాజాగా సంయుక్త షేర్ చేసిన ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. ఈ బ్యూటీ తెలుగింటి సీతలా చీరలో అందంగా కనిపించింది. ఎరుపు వంగపువ్వు రంగు మిశ్రమంతో రూపొందించిన ఈ డిజైనర్ శారీ జరీ అంచుతో తళతళలాడుతోంది. ఇక కాంబినేషన్ బ్లౌజ్ మోడ్రన్



అప్పీల్ తో మైమరిపిస్తోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వేగంగా దూసుకెళుతోంది. సంయుక్త చీరలో ఎంతో అందంగా కనిపిస్తోందని, తెలుగింటి సాంప్రదాయం ఉట్టిపడుతోందని నెటిజనులు ప్రశంసిస్తున్నారు. ఆ కళ్లలో మెరుపు.. నాటీ హొయలు మతి చెడగొడుతున్నాయి! అంటూ యూత్ వ్యాఖ్యానిస్తున్నారు. ఓవరాల్ గా సంయుక్త శారీ లుక్ తో స్టన్నర్ గా మారింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. సంయుక్త ఇటీవల డెవిల్: ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ చిత్రంలో కనిపించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి ప్రదర్శన ఇవ్వనప్పటికీ, తన నటనా నైపుణ్యంతో మైమరిపించింది. టాలీవుడ్ లో ప్రతిభావంతులైన నిఖిల్, శర్వానంద్, రానా వంటి స్టార్లతో ప్రస్తుతం సినిమాలు చేస్తోంది. నిఖిల్ సరసన స్వయంభు అనే చిత్రంలో సంయుక్త నటిస్తోంది. మరోవైపు మలయాళం, హిందీ చిత్రాలలోను సంయుక్త నటిస్తోంది. కానీ తనకు మంచి అవకాశాలిచ్చి ప్రోత్సహిస్తున్న తెలుగు చిత్రసీమకు తొలి ప్రాధాన్యతనిస్తోంది.

## అక్క మనసులో ప్రేమను ముందే పసిగట్టిన చెల్లెలు!

అక్కినేని నాగచైతన్య-శోభిత ధూళిపాళ ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. కొంత కాలం పాటు ప్రేమించుకున్న జంట ధాంపత్య జీవితంలోకి అడుగు పెట్టడంతో ప్రేమ కథకు ఫుల్ స్టాప్ పడింది. భార్యాభర్తలుగా కొత్త జీవితాన్ని ప్రారంభించారు. తాజాగా అక్క మనసులో చైతన్యపై ఉన్న ప్రేమ గురించి శోభిత చెల్లెలు సమంత రివీల్ చేసారు. ఈ పెళ్లి వేడుకలో సమంత కూడా సందడి చెసిన సంగతి తెలిసిందే. తాజాగా పెళ్లికి సంబంధించిన కొన్ని ఫోటోలు పంచుకుంటూ అక్కపై తన ప్రేమను చాటుకుంది. %-%ఇది నా జీవితంలో చాలా ఎమోషనల్ మూవ్ మెంట్. అక్కా నిన్ను చాలా ప్రేమిస్తున్నా. మమ్మల్ని నువ్వు ఎంత



ఇష్టపడతావో? అలాగే కొత్తగా నీ జీవితంలోకి వచ్చిన వ్యక్తిని ఎంతగా ప్రేమిస్తావో నాకు మాత్రమే తెలుసు. ఇద్దరు ఎంతో అందంగా ఉన్నారు. గౌరవ ప్రదరమైన జంట అంటూ రాసుకొచ్చింది. శోభిత పెళ్లి కుమార్తె దుస్తుల్లో ఉన్న ఫోటోను పంచుకుంది. ఇక శోభిత సిస్టర్ సమంత డాక్టర్. సమంత 2022లోనే పెళ్లి చేసుకుంది. అంటే అక్క కంటే ముందే చెల్లెలు వివాహం జరిగింది.

శోభిత తండ్రి నేవల్ ఆఫీసర్ అన్న సంగతి తెలిసిందే. అచ్చ తెలుగు కుటుంబానికి చెందిన అమ్మాయి శోభిత. తెనాలిలో పుట్టి వైజాగ్ లో చదువుకుంది. చదువు పూర్తయిన అనంతరం మోడలింగ్ లోకి ఎంటర్ అయి బాలీవుడ్ సినిమాలకు ప్రమోట్ అయింది. అక్కడ నుంచి టాలీవుడ్ కి వచ్చింది. చివరిగా అక్కినేని ఇంట నాగార్జున పెద్ద కోడలు అయింది. వివాహం తర్వాత శోభిత సినిమాలు చేసే అవకాశం ఉంది. కానీ ఆమె ఇంత వరకూ కొత్త ప్రాజెక్ట్ లు ఏవీ ప్రకటించలేదు. బాలీవుడ్ లో కూడా సినిమాలు చేయలేదు.





# రేవంత్ చేతికి బ్రహ్మాస్త్రం - కేటీఆర్ "ఫిక్స్"..!!

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి కర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఏడాది పాలన పూర్తి చేసుకున్న రేవంత్ ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోంది. పాలనలో .. రాజకీయంగా నూ కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. రెండు కేసుల్లో మాజీ సీఎం కేసీఆర్ .. మాజీ మంత్రి కేటీఆర్ కు ఉచ్చు బిగుస్తోంది. ఇక, ప్రభుత్వంలో తాజాగా అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. కేటీఆర్ ఫిక్స్ అయినట్లు కనిపిస్తోంది. తరువాతి నిర్ణయాల పై ఆసక్తి కొనసాగుతోంది.

**సీఎస్ లేఖతో...** మాజీ మంత్రి కేటీఆర్ కు ఉచ్చు బిగుస్తోంది. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసు వ్యవహారంలో తాజా పరిణామంతో ఆసక్తి కర పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ అంశంలో ఇప్పటి కే గవర్నర్ విచారణకు అనుమతి ఇచ్చారు. దీంతో, ఈ కేసులో లోతుగా దర్యాప్తు చేయాలని కోరుతూ ఏసీబీకి తెలంగాణ సీఎస్ శాంతికుమారి లేఖ రాశారు. గవర్నర్ ఇచ్చిన అనుమతిని సీఎస్ తాను రాసిన లేఖకు జత చేసి ఏసీబీకి పంపించారు. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో నిధుల దుర్వినియోగంపై పూర్తి విచారణ జరపాలని సీఎస్ కోరారు.

**విచారణ షురూ...** ఈ లేఖలో సీఎస్ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ నిర్ణయాలు.. అనుమతులు.. పూర్వాపరాలు.. నిర్వహణ విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ తీసుకున్న చర్యల పైనా సమగ్ర దర్యాప్తు చేయాలని సీఎస్ సూచించారు. ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ కరెన్సీ చెల్లింపు పైన అభియోగాలు ఉన్నాయి. ప్రజాధనం దుర్వినియోగం చేసారనేది ప్రధాన ఆరోపణ. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ చెల్లింపులు చేయటం పైన పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు. ఇదే కేసులో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు అధికారులు ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్నారు.

**వాట్ నెక్స్ట్...** అయితే, ఈ కేసులో కేటీఆర్ ను ఏ -1 గా చేర్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. ఇప్పుడు సీఎస్ లేఖతో ఏసీబీ విచారణ ప్రారంభించే అవకాశం ఉంది. అందులో భాగంగా రూ.55 కోట్ల ఫార్ములా-ఈ నిధుల దుర్వినియోగం కేసులో విచారణకు తమ ముందు హాజరు కావాలంటూ ఏసీబీ కేటీఆర్‌కు నోటీసులు పంపనుంది. తాజాగా ఏసీబీ అధికారులు కేటీఆర్ కేసుకు సంబంధించిన వివరాలను సీఎంకు వివరించినట్టు సమాచారం. దీంతో... ఇప్పుడు ఈ కేసులో ఏసీబీ తీసుకునే నిర్ణయాలు.. జరిగే పరిణామాల పైన రాజకీయంగా ఉత్కంఠ కొనసాగుతోంది.




# ఫార్ములా ఈ రేస్‌పై రేవంత్‌కు కేటీఆర్ సవాల్...

హైదరాబాద్, డిసెంబర్ 18: ఫార్ములా ఈ రేస్ వ్యవహారానికి సంబంధించి వస్తున్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాసిన మాజీ మంత్రి.. దమ్ముంటే ఫార్ములా- ఈ రేస్ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ రేస్‌పై రకరకలా వార్తలు వస్తున్నాయని.. ముఖ్యంగా తన గురించి ఆరోపణలు వస్తున్నాయన్నారు.

ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలోనే ఈ అంశంపై చర్చ కూడా జరిగినట్లు తెలిసిందన్నారు. హైదరాబాద్‌కు మంచి జరగాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా ఈ రేస్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కానీ రాజకీయ కక్షలకు బలి చేశారని మండిపడ్డారు. మొదటి దఫా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో విజయవంతంగా జరుగగా.. రెండో దఫాలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏకపక్షంగా రద్దు చేశారని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రజలు నిజాలు తెలుసుకునే హక్కు ఉన్నందున ఈ అంశాలన్ని శాసనసభలో చర్చ పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**కేటీఆర్ లేఖ ఇదే..** "ఫార్ములా – ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తోంది. ఇదే విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయి. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకుంది.

2023లో విజయ వంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకుంది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ది చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది" అని మాజీ మంత్రి అన్నారు.

# జేపీసీకి జమిలి.. కమిటీలో ప్రియాంక గాంధీ..!

దిల్లీ: దేశవ్యాప్తంగా ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు వీలుగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జమిలి ఎన్నికల రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రతిపక్షాల డిమాండ్‌తో ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) పంపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును పరిశీలించే జేపీసీ నామినీ జాబితాలో కాంగ్రెస్ తరపున ఆ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ పేరు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆమెతో పాటు కాంగ్రెస్ నుంచి మనీశ్ తివారీ, రణ్‌దీప్ సూర్జేవాలా, సుఖ్‌దేవ్ భగత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. ఈ కమిటీలో సభ్యులుగా కల్యాణ్ బెనర్జీ, సాకేత్ గోఖలేల పేర్లను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. కాగా.. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు అనువుగా 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టింది. 90 నిమిషాల చర్చ అనంతరం ఓటింగ్ జరగ్గా బిల్లుకు అనుకూలంగా 269 మంది.. వ్యతిరేకంగా 198 మంది ఓటేశారు. దీంతో బిల్లును ప్రవేశపెట్టడానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోద ముద్ర వేశారు. అయితే.. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున జేపీసీకి పంపాలని డిమాండ్ చేశాయి. దీంతో ఈ బిల్లును జేపీసీకి పంపారు. ఈ కమిటీలో ప్రియాంక గాంధీ కూడా సభ్యురాలు కానున్నట్లు తెలుస్తోంది.

# 'మూసీ'పై అబద్ధాలు ఎందుకు.. ఎవరి లాభం కోసం?: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: భారాస సభ్యులు మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు సభను తప్పుదోవ పట్టించారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కవిత మాట్లాడారు. "మూసీ ప్రాజెక్ట్ కోసం ప్రపంచ బ్యాంకు రుణం అడగలేదని శ్రీధర్‌బాబు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో రుణం అడిగినట్లు సాక్ష్యాధారాలు బయటపెడుతున్నాం. డీపీఆర్ లేదని అసెంబ్లీలో చెబుతున్నారు. ప్రపంచబ్యాంకుకు సెప్టెంబర్ 19న ఇచ్చిన నివేదికలో డీపీఆర్ ఉందని పేర్కొన్నారు. అబద్ధాలు ఎందుకు? ఎవరి లాభంకోసం ఇదంతా చేస్తున్నారు? ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. భారాస అధికారంలో ఉండగా ప్రపంచ బ్యాంకును తెలంగాణలో అడుగుపెట్టనివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్‌కార్పెట్ వేస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రూ. 14వేల కోట్ల సాయం అడిగారు. మూసీ ప్రాజెక్టుపై అబద్ధాలు చెబుతున్న ఈ ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తే లేదు" అని కవిత అన్నారు.

# భారాస పాలనలో రహదారులను విధ్వంసకరంగా మార్చింది: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



భారాస పదేళ్ల పాలనలో రహదారులను విధ్వంసకరంగా మార్చిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో మట్టి రోడ్డు లేకుండా చేస్తామన్న కోమటిరెడ్డి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పనులను వేగవంతం చేశామని తెలిపారు.


ప్రతి గ్రామం నుంచి మండలం వరకు సింగిల్ బీటీ రోడ్డు, మండల కేంద్రం నుంచి జిల్లాకు వెళ్లేందుకు డబుల్ బీటీ రోడ్డు వేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన మాట్లాడారు

# అసెంబ్లీ బయట డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు పెట్టాలి.. హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు.

# కాళేశ్వరంపై కీలక విషయాలు బయటపెట్టిన రిటైర్డ్ ఐఏఎస్



హైదరాబాద్, డిసెంబర్ 18: కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు, మేడిగడ్డ కుంగుబాటుపై కాళేశ్వరం కమిషన్ విచారణ కొనసాగుతోంది. ఈరోజు (బుధవారం) నుంచి రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, రిటైర్డ్ ఇంజనీర్లతో ప్రస్తుత ఐఏఎస్ అధికారులను కమిషన్ విచారించనుంది. అందులో భాగంగా ఈరోజు పలువురు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు కమిషన్ ముందు హాజరయ్యారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎస్‌కే జోషి, నీటిపారుదల శాఖ కార్యదర్శిగా పనిచేసిన రజత్ కుమార్‌ను కమిషన్ విచారించింది. ఈ కమిషన్ విచారణ వాడీవేడీగా జరిగింది. ఓపెన్ కోర్టు నిర్వహించిన కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్ మొదట రిటైర్డ్ సీఎస్, రిటైర్డ్ ఇరిగేషన్ సెక్రటరీ శైలేంద్ర కుమార్ జోషిని విచారించింది. తుమ్మిడిహట్టి నుంచి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ఎందుకు మార్చారని కమిషన్ ప్రశ్నించగా.. అక్కడ నీటి లభ్యత ఎక్కువ లేదని సీడబ్ల్యూసీ చెప్పిందని జోషి తెలిపారు. ప్రాజెక్ట్ స్థలాన్ని ఎవరు మార్చారని కమిషన్ మరో ప్రశ్న వేయగా.. నాటి సీఎం కేసీఆర్, మంత్రులు నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని జోషి సమాధానం ఇచ్చారు.

దీని పై ఏదైనా కేబినెట్ సబ్ కమిటీ వేశారా అని కమిషన్ అడుగగా.. కేబినెట్ సబ్ కమిటీ ఏమీ లేదని జోషి చెప్పారు. హైపవర్ కమిటీ గురించి కమిషన్ ప్రశ్నించగా.. దాని గురించి తెలియదని జోషి మొదట సమాధానం ఇచ్చారు. అయితే కమిషన్ జీవో చూపించడంతో ఆయన అవునని ఒప్పుకున్నారు. అది టెక్నికల్ కమిటీ మాత్రమేనని వెల్లడించారు. మహారాష్ట్ర వైపు ముంపు ఎక్కువ ఉండడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ కట్టారని తెలిపారు. కాళేశ్వరం కాంప్లెక్స్ ప్రాజెక్ట్.. 28 ప్యాకేజీలు.. 8 లింకులతో కట్టారన్నారు. ఒక్కసారే అప్రూవల్ లేదని.. వివిధ సమయాల్లో ఆయా ప్యాకేజీలకు దాదాపు 200 అనుమతులు ఇచ్చి ఉంటారని జోషి చెప్పారు. కాగా.. ఈరోజు నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ తిరిగి ప్రారంభమైంది.

ఈ దఫా వారం రోజుల పాటు కమిషన్ విచారించనుంది. ఈసారి కమిషన్ ముందుకు కీలక ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులు హాజరుకానున్నారు. కీలక సోమేశ్ కుమార్, స్మిత సభర్వాల్ తదితరులు కమిషన్ ముందు విచారణకు హాజరుకానున్నారు.

# కూల్చివేతలపై కీలక ప్రకటన.. హైడ్రా విధివిధానాలు వివరించిన రంగనాథ్



హైదరాబాద్: నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన చేసింది. హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ హైడ్రా కూల్చదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. "అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు జులై 2024కి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే హైడ్రా కూల్చదు. ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు లేకుండా కట్టిన వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం కూల్చక తప్పదు. గతంలో అనుమతులు ఇచ్చి తరువాత రద్దు చేస్తే అవి అక్రమ కట్టడాలే అవుతాయి. అనుమతులు రద్దైనా నిర్మాణాలు జరుగుతుంటే అక్రమ కట్టడాలుగానే పరిగణిస్తాం. పేదలను ముందు పెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్ చర్యలను హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుంది. మల్లంపేట కొత్వాల్ చెరువు, అమీన్‌పూర్‌లో కూల్చివేసినవి అక్రమ కట్టడాలే. ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు హైడ్రా ప్రాధాన్యత ఇస్తుంది. 12 చెరువుల్లో కూల్చివేతలు చేపట్టాం.. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు మొదలు పెడతాం. 5 నెలల అనుభవాల నుంచి హైడ్రా అనేక అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్తోంది. లోటుపాట్లు ఏమైనా ఉంటే వాటిని సవరించుకొని మరింత నిబద్ధతతో హైడ్రా పనిచేస్తోంది. వివిధ సందర్భాలలో కోర్టులు ఇచ్చిన తీర్పులకు లోబడి హైడ్రా ముందుకు వెళ్తోంది. ప్రభుత్వం దిశానిర్దేశం మేరకు హైడ్రా పని చేస్తుంది. హైడ్రాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెట్టింది. సాంకేతికంగా కూడా మరింత బలంగా తయారవుతుంది. గత 5 నెలల్లో హైడ్రా దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది" అని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

# గరిష్ఠ వాణిజ్య లోటు.. మోదీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించకుండా, చట్ట ప్రకారం జరిగే వ్యాపారాలను పట్టించుకోకుండా, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి (క్రోనీ క్యాపిటలిజం) అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ అవలంభించే ఇటువంటి చర్యల ఫలితంగా దేశంలో తయారీ రంగం బలహీనపడుతోందని, కరెన్సీ విలువ పడిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

రికార్డు స్థాయిలో గరిష్ఠ వాణిజ్య లోటు, అధిక వడ్డీ రేట్లు పెరుగుతాయని తెలిపారు. ఈకారణంగా వస్తువుల వినియోగం తగ్గి ద్రవ్యోల్బణం పెరుగుదల వంటివన్నీ చూస్తామని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. దేశంలో వాణిజ్య లోటు, దిగుమతులు గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నాయని వస్తున్న వార్తా కథనాలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రభుత్వాలు ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలకు ప్రాధాన్యమిస్తే ఇలాకాక ఇంకేం జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. వాణిజ్య మంత్రిత్వశాఖ డేటా ప్రకారం.. నవంబరులో దేశీయ వాణిజ్య ఎగుమతులు ఏడాదిక్రితం ఇదే నెలతో పోలిస్తే 4.85% తగ్గి 32.11 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు 27% పెరిగి రికార్డు స్థాయి 69.95 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 37.84 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇది జీవనకాల గరిష్ఠ స్థాయి. ప్రధానంగా పసిడి దిగుమతులు గణనీయంగా పెరగడం వల్లే, వాణిజ్యలోటు ఇంతగా నమోదైందని వాణిజ్యశాఖ గణాంకాలు వెల్లడించాయి. పసిడి దిగుమతులు గత నెలలో రికార్డు గరిష్ఠమైన 14.86 బిలియన్ డాలర్లకు చేరాయి.

# ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోంది: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా ఆ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. "పదేళ్లలో భారాస చేయని అభివృద్ధి ఏడాదిలో చేయమంటే ఎలా..? ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం. ఓవర్సీస్ ఉపకార వేతనాలను ఎక్కడ ఆపలేదు. భారాస సభ్యులు సభను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి" అన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పదేళ్ల భారాస హయాంలో ఆ పార్టీ నేతలు రూ. వేలకోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, దళితబంధు, ఈ-కార్ రేసుల్లో కమీషన్లు తీసుకున్నారన్నారు.

**భారాస సభ్యులపై స్పీకర్ ఆగ్రహం** : అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ భారాస సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వివేకానంద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నామన్నారు. మరో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సీనియర్ సభ్యులు కొత్త సభ్యులకు నేర్పించేది ఇదేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com